యాదగిరిగుట్ట క్షేత్రంలో 20 నుంచి 22 వరకు కార్తిక ఉత్సవాలు



హైదరాబాద్ పెన్ పవర్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు కార్తిక ఉత్సవం–2026 కార్యక్రమాల నిర్వహణకు దేవస్థానం, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా శ్రీకారం చుట్టాయి. ఇందులో భాగంగా ఆధ్యాత్మిక, భక్తి, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 20న మాడుగుల నాగఫణిశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం, తేలు విజయ ఆధ్వర్యంలో భక్తి సంగీతం. 21న ప్రముఖ సంగీత దర్శకులు ఆర్.పి.పట్నాయక్ ఆధ్వర్యంలో సంగీత విభావరి. 22న పరంపర సంస్థ ఆధ్వర్యంలో అభినేత్రి బృందంతో తెలంగాణ దేవాలయాల ఇతివృత్తంతో ప్రత్యేక నృత్యప్రదర్శన జరుగుతుందని ఆలయ ఈవో భవానీ శంకర్ మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అలాగే ఈ నెల 19, 20 తేదీల్లో శ్రీలక్ష్మీనరసింహస్వామి నామార్చన సహిత కోటి పుష్పార్చన మహాపర్వాన్ని నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

యాభై వేలు లంచం తీసుకుంటూ..

ఏసీబీకి దొరికిన భైంసా మున్సిపల్ కమిషనర్ !




హైదరాబాద్ పెన్ పవర్: నిర్మల్ జిల్లా కేంద్రంలో భైంసా మున్సిపల్ కమిషనర్ సంతోష్ కుమార్ లంచగొండితనం బయటపడింది. యాభై వేల లంచం తీసుకుంటుడగా భైంసా మున్సిపల్ కమిషనర్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. ఒక కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటుడగా ఏసీబీ అతనిని పట్టుకుంది.లక్ష రుపాయలు డిమాండ్ చేసి యాభై వేలు తీసుకున్న కమిషనర్ నిర్వాకం బయటపడింది. భైంసా మున్సిపల్ కమిషనర్ జాదవ్ సంతోష్‌ను ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు.నిర్మల్ జిల్లా కేంద్రంలో ఏసీబీ అధికారులు మంగళవారం రోజున దాడులు నిర్వహించారు. ఒక వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా భైంసా ఇన్ ఛార్జ్ కమిషనర్ సంతోష్ జాదవ్ కారును సినీ ఫక్కిలో వెంబడించి పట్టుకున్నారు. భైంసాలో ఓ కాంట్రాక్టర్ కు చెందిన 2 లక్షల 60 వేల బిల్లు మంజూరు చేసే విషయంలో 50 వేల రూపాయలు లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం.నిర్మల్ లోని ఓ హోటల్ వద్ద 50 వేల రూపాయలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం ఇంచార్జ్ కమిషనర్ ను ఏసీబీ అధికారులు ఇంటికి తరలించి విచారణ చేపడుతున్నారు.

అనంతసాగర్ చెరువులో మొసళ్ల సంచారం..

భయాందోళనలో స్థానికులు

- సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం అనంతసాగర్ చెరువులో మొసళ్ల సంచారం
- చెరువు మధ్యలోని గుట్టపై మొసలి ప్రత్యక్షం కావడంతో భయాందోళనలో ప్రజలు
- వారం రోజుల క్రితం సమీపంలోని రోడ్డు దాటుతూ కనిపించిన మరో మొసలి
- పశువులు నీటి కోసం వెళ్లే క్రమంలో దాడులు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన 4లో...
- మొసళ్లను బంధించి మంజీరా నదికి తరలించాలని అటవీ శాఖకు గ్రామస్తుల విజ్ఞప్తి



అండాల సేకరణలో అక్రమాలు అనేకం

- దానం చేస్తున్న 31 మంది మహిళల గుర్తింపు
- ఏడు కేంద్రాలకు షోకాజ్ నోటీసులు



హైదరాబాద్ పెన్ పవర్: మహిళల నుంచి అక్రమంగా అండాలు సేకరిస్తున్న కేంద్రాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి అమాయక మహిళలను తీసుకొచ్చి వారికి డబ్బు ఆశ చూపి వారి నుంచి నిబంధనలకు విరుద్ధంగా అండాలను సేకరిస్తున్న ముఠాను రాష్ట్ర పోలీసులు ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ ముసుగులో జరిగే అవకతవకలపై లోతుగా విచారించేందుకు వైద్య ఆరోగ్యశాఖ 10 టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించింది. గత నాలుగైదు రోజులుగా ఈ బృందాలు అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ(ఏఆర్‌టీ) కేంద్రాల్లో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 44 ఏఆర్‌టీ కేంద్రాలు ఉండగా 27 చోట్ల తనిఖీలు పూర్తయ్యాయి. వాటిలో ఏడు కేంద్రాల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలింది. ఈ సందర్భంగా అండాలు దానం చేస్తున్న 31 మంది మహిళలను అధికారులు గుర్తించారు. వారిని వ్యక్తిగతంగా కలిసి విచారిస్తున్నారు. అండాల సేకరణలో అక్రమ దందాపై కఠినంగా వ్యవహరించాలని తాజాగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు.

మధ్యవర్తుల పాత్రపై విచారణ


అండాల సేకరణ దందాలో వైద్యులు, ఐవీఎఫ్ కేంద్రాలు, మధ్యవర్తుల పాత్రపై విచారణ చేస్తున్నారు. హైదరాబాద్‌లోని కొన్ని ఏఆర్‌టీ కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో మహిళ నుంచి పలుమార్లు

- మిగతా 4లో...

జూబ్లీహిల్స్‌లో తాగునీటి వృథా..

డెయిరీ సంస్థకు రూ.20 వేల జరిమానా

- ఫ్లోర్ శుభ్రం చేయడానికి తాగునీటిని వాడిన అక్షయకల్ప సంస్థకు జరిమానా
- జూబ్లీహిల్స్‌లో రూ.20,000 ఫైన్ విధించిన జలమండలి అధికారులు
- జరిమానాతో పాటు మురుగునీటి కనెక్షన్‌ను తాత్కాలికంగా తొలగింపు
- వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి వృథాపై నగరవ్యాప్తంగా కఠిన తనిఖీలు
- నీటి దుర్వినియోగంపై ఫిర్యాదులకు వాట్సాప్ నంబర్ జారీ



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్‌లో తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు జలమండలి (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. జూబ్లీహిల్స్‌లో తాగునీటిని ఫ్లోర్ శుభ్రం చేయడానికి వినియోగించినందుకు గాను ప్రముఖ సంస్థ అక్షయకల్ప ఫార్మ్ అండ్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.20,000 జరిమానా విధించారు.జూబ్లీహిల్స్ రోడ్ నెం.70లోని జర్నలిస్ట్ కాలనీలో ఉన్న అక్షయకల్ప ప్రాంగణంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటిని నేల శుభ్రపరచడానికి వాడుతున్నట్లు గుర్తించి, వెంటనే జరిమానా విధించారు. అంతేకాకుండా నిబంధనల ప్రకారం ఆ సంస్థ మురుగునీటి కనెక్షన్‌ను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు.రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో నీటి వృథాను అరికట్టేందుకు జలమండలి తనిఖీలను ముమ్మరం చేసింది. తాగునీటిని కేవలం తాగడానికి, వంట అవసరాలకు మాత్రమే వినియోగించాలని నగరవాసులకు, వాణిజ్య సంస్థలకు స్పష్టం చేసింది. ఫ్లోర్ క్లీనింగ్, వాహనాలు కడగడం, తోటపని, నిర్మాణ పనులకు మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నుంచి సరఫరా అయ్యే ట్రీటెడ్ వాటర్‌ను వాడుకోవాలని సూచించింది.నగరవ్యాప్తంగా ఈ తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఎక్కడైనా తాగునీటి వృథా జరుగుతుంటే, దానికి సంబంధించిన ఫొటోలు లేదా వీడియోలతో 99499 30003 అనే వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

లక్ష్మణ్‌గౌడ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం

మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్ పెన్ పవర్: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్‌గౌడ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని.. మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మణ్‌గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారాస అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థికసాయంగా అందించారు. అనంతరం హరీశ్ మాట్లాడుతూ.. లక్ష్మణ్‌గౌడ్ మృతి అత్యంత బాధాకరమన్నారు. ఆయన కొనుగోలు చేసిన జేసీబీని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మైనింగ్ కేసులో సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచినట్లు బాధిత కుటుంబ సభ్యులు చెప్పారన్నారు. భారీగా జరిమానాలు విధించడంతో విడిపించుకోలేకపోయారని, దీంతో అప్పుల భారం పెరిగిపోయిందన్నారు. లక్ష్మణ్‌గౌడ్ 13 ఎకరాల్లో పంట సాగుచేసి నష్టపోవడం, ఆయన భూమి నిషేధిత జాబితాలో ఉండటంతో అప్పులు తీర్చేందుకు.. దానిని అమ్మే అవకాశం లేకుండా పోయిందని.. ఈ పరిమాణాలన్నీ ఆయన్ను ఆందోళనకు గురిచేశాయని తెలిపారు.ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ బాధిత కుటుంబానికి సహాయం చేయకుండా.. తమపై కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి విమర్శలు చేయడం తగదని పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు ఎండీ ఫిరోజ్, మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీశ్‌రెడ్డి, సర్పంచులు కోడూరి స్వర్ణలత, మద్దికుంట రాధ పాల్గొన్నారు.

రూ.66కే బియ్యం



నిజామాబాద్, నవంబర్ 10, పెన్ పవర్:
బియ్యం ధరలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బియ్యం ధరలకు గరిష్ట పరిమితులు విధించింది. కొంతమంది ఎక్కువ ధరలకు బియ్యంను విక్రయిస్తున్న క్రమంలో దానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా బియ్యం ధరలను ఫిక్స్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలులోపే బియ్యం విక్రయించాలి. అంతకంటే అధిక ధరలకు విక్రయిస్తే ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. బియ్యం రకాలను బట్టి గరిష్ట ధరలను ఫిక్స్ చేసింది. అలాగే బియ్యం బస్తాలపై గరిష్ట చిల్లర ధరలను కూడా ముద్రించాల్సిందేనని ఆదేశించింది. అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్టులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేసింది. బియ్యం ధరల్లో మోసాలకు పాల్పడితే సహించేది లేదంటూ హెచ్చరించింది.బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యంకు సంబంధించి కిలో గరిష్ట ధర రూ.66గా ఫిక్స్ చేసింది. ఇక ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకం కిలో గరిష్ట ధర రూ.74గా పరిమితి విధించింది. అలాగే హెచ్ఎంటీ, జైశ్రీరాం రకం బియ్యం గరిష్ట చిల్లర ధర రూ.79గా నిర్ణయించింది. ఎల్నినో ప్రభావం క్రమంలో పంట దిగుబడి తగ్గడంతో బియ్యం ధరలు దేశవ్యాప్తంగా పెరిగాయి. తెలంగాణలోనూ బియ్యం ధరలు పెరగ్గా.. కొంతమంది వ్యాపారులు దీనిని అసరాగా తీసుకుని ధరలు పెంచేస్తున్నారు. కిలో రూ.100, ఆపై ధరలకు విక్రయిస్తున్నారు. పెరిగిన ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతోంది. దీంతో బియ్యం ధరల పెరుగుదలకు కళ్లెం వేసేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ రంగంలోకి దిగింది. రాష్ట్రంలో బియ్యం కొరత ఉందనే ప్రచారాన్ని ప్రభుత్వం తిప్పికొట్టింది. తగినన్ని నిల్వలు ఉన్నాయని, అందులో ఎలాంటి సమస్య లేదని పేర్కొంది.

మార్కెట్ ధరలను తారుమారు చేయడం, బియ్యంను అక్రమంగా నిల్వచేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాలశాఖ హెచ్చరించింది. నిరంతరం మిల్లర్లు, వ్యాపారులపై తనిఖీలు జరుగుతాయని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపింది. అక్టోబర్ 29వ తేదీ నుంచి నవంబర్ 5వ తేదీ వరకు ఎన్ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్, లీగల్ మెట్రాలజీ శాఖలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాయి. రిటైల్ దుకాణాలు, టోకు వ్యాపారుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. పడే పడే అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల్లోపు మాత్రమే బియ్యం అమ్మాలని తెలిపింది. కాగా తెలంగాణలో బియ్యం ధరలు భారీగా పెరిగాయి. బహిరంగ మార్కెట్లో కిలో రూ.100 వరకు చేరుకున్నాయి

హోటల్స్ కు మద్దతుగా ఓవైసీ

హైదరాబాద్, నవంబర్ 10, పెన్ పవర్:
భాగ్యనగరంలో ఇటీవల కాలంలో టీజీ సేఫ్ నిర్వహిస్తున్న ఆకస్మిక తనిఖీలతో హోటళ్ల యజమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారికి మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ బాహాటంగా మద్దతుగా నిలిచారు. ట్విన్ సిటీస్ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందంతో కలిసి ఆయన తెలంగాణ సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతిని కలిశారు. నగరవ్యాప్తంగా ఆహార భద్రతా అధికారులు చేపడుతున్న తనిఖీలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, చట్టబద్ధమైన నియమ నిబంధనలకు లోబడి మాత్రమే సాగాలని, వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసే ధోరణికి స్వస్తి పలకాలని ఈ సందర్భంగా కమిషనర్‌ను ఆయన గట్టిగా కోరారు.తనిఖీల పేరిట నిబంధనలను అతిక్రమించి ఏకపక్ష చర్యలకు పాల్పడటం సరికాదని అసదుద్దీన్ నేతృత్వంలోని బృందం ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లింది. నిబంధనల ప్రకారం ఏదైనా హోటల్‌లో లోపాలు కనిపిస్తే.. వెంటనే తీవ్ర చర్యలు తీసుకోకుండా తొలుత ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేసి నిర్దిష్ట గడువు ఇవ్వాల్సి ఉంటుందని గుర్తుచేశారు. ఆ చట్టబద్ధమైన ప్రక్రియను దాటవేసి సోషల్ మీడియాలో విజువల్స్ విడుదల చేయడం, వ్యాపార సంస్థల ప్రతిష్టను మసకబార్చడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.హైదరాబాద్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆహార సంస్కృతి, గుర్తింపును పరిరక్షించడంలో హోటల్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని అసదుద్దీన్ వర్గం పేర్కొంది. వేలాది మంది కార్మికులు, చిరువ్యాపారుల జీవనోపాధి ఈ రంగంపై ఆధారపడి ఉన్న వేళ.. కేవలం చిన్నపాటి లోపాలను సైతం భూతద్దంలో చూపిస్తూ హోటళ్లను సీజ్ చేయడం లేదా లైసెన్సులు రద్దు చేయడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార నాణ్యతను కాపాడటానికి తాము వ్యతిరేకం కాదని, అయితే అధికారుల వైఖరి పారదర్శకంగా, సమానంగా ఉండాలే తప్ప.. ఎంపిక చేసుకున్న కొన్ని సంస్థలనే లక్ష్యంగా చేసుకుని వేధించేలా ఉండకూడదని వ్యాపారులు వాపోయారు.పౌరుల ఆరోగ్య పరిరక్షణ ఎంత ముఖ్యమో, వ్యాపారాలు గౌరవప్రదంగా సాగే వాతావరణం కల్పించడం కూడా అంతే ఆవశ్యకమని అసదుద్దీన్ అంటున్నారు. హోటల్ నిర్వాహకులకు సరైన మార్గదర్శకాలు ఇచ్చి, వారిలో అవగాహన పెంచేలా అధికారులు సహకారాత్మక ధోరణితో వ్యవహరించాలని కోరారు

సిటీలో హై-ఎండ్ ఓవర్ సప్లై

హైదరాబాద్, నవంబర్ 10, పెన్ పవర్:
కోవిడ్ తదుపరి కాలంలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో రూ. 2 కోట్లు, అంతకంటే ఎక్కువ విలువైన లగ్జరీ,అల్ట్రా-లగ్జరీ ఇళ్లకు విపరీతమైన డిమాండ్ కనిపించింది. దాంతో ప్రముఖ బిల్డర్లు, డెవలపర్లు అంతా తమ దృష్టిని లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణాలపైనే కేంద్రీకరించారు. అయితే, ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు జరగకపోవడం , వరుసగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభమవ్వడంతో ప్రస్తుతం భాగ్యనగరంలో లగ్జరీ విభాగంలో అమ్ముడవని గృహాల సంఖ్య గణనీయంగా పెరిగిపోయి హై-ఎండ్ ఓవర్ సప్లై పరిస్థితి ఏర్పడింది.నగరంలో భూముల ధరలు, నిర్మాణ వ్యయం పెరగడంతో పాటు ఇళ్ల ధరలు సైతం సామాన్యులకు అందుబాటులో లేకుండా పెరిగిపోవడం కొనుగోలుదారుల్లో నిరాశను నింపింది. రూ. 2 కోట్ల పైబడిన ఆస్తులను కొనుగోలు చేసే సామర్థ్యం ఉన్న ఉన్నత వర్గాల డిమాండ్ ఒక స్థాయికి చేరుకుని సంతృప్త స్థితికి రావడంతో, మార్కెట్‌లో భారీగా నిర్మించిన లగ్జరీ ఫ్లాట్లు అమ్ముడవకుండా

మిగిలిపోతున్నాయి. ఇది డెవలపర్ల మూలధనం నిలిచిపోయేలా చేసి, ప్రాజెక్టు నిర్వహణపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది.ఈ సవాలును అధిగమించేందుకు నగర రియల్టర్లు తమ వ్యూహాన్ని వేగంగా మార్చుకుంటున్నారు. విలాసవంతమైన లగ్జరీ నిర్మాణాల కంటే నిజమైన కొనుగోలుదారులు అధికంగా ఉన్న 70 లక్షల నుంచి 1.20 కోట్ల బడ్జెట్ ప్రాజెక్ట్‌లను డిజైన్ చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. మధ్యతరగతి , ఎగువ-మధ్యతరగతి ఉద్యోగులు, ఐటీ రంగానికి చెందిన యువ కొనుగోలుదారుల బడ్జెట్‌కు తగినట్లుగా 2దీనఖ, 3దీనఖ ఫ్లాట్లను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా కొత్త ప్రణాళికలు రచిస్తున్నారు.హైదరాబాద్ ఐటీ కారిడార్లకు

కాస్త దూరంగా ఉన్న గ్రోత్ కారిడార్లు, నివాస ప్రాంతాలలో ఈ మిడ్-సెగ్మెంట్ గృహాల నిర్మాణాలు వేగవంతమవుతున్నాయి. అనవసరమైన విలాసవంతమైన ఆమేనిటీస్‌ను తగ్గించి, స్థల వృధా లేకుండా సమర్థవంతమైన లేఅవుట్లతో అందుబాటు ధరల్లో ఇళ్లను అందించడం ద్వారా మార్కెట్‌లో నిలిచిపోయిన క్రయవిక్రయాలకు మళ్లీ ఊపిరి పోయవచ్చని రియల్ ఎస్టేట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మార్పు హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌ను మరింత సుస్థిరమైన దారిలో నిలబెడుతోంది.

తమ్మిడికుంట చెరువు ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్.. గౌరవ అతిథిగా నాగార్జున !

హైదరాబాద్ పెన్ పవర్: మాదాపూర్‌లో తమ్మిడికుంట చెరువును సీఎం రేవంత్ రెడ్డి (నవంబర్ 11, 2026) సాయంత్రం ప్రారంభించనున్నారు. తమ్మిడికుంట చెరువు ప్రారంభోత్సవానికి హైడ్రా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తమ్మిడికుంట ప్రారంభోత్సవానికి గౌరవ అతిథిగా సినీ నటుడు అక్కినేని నాగార్జునకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది.

ఇదే తమ్మిడికుంట చెరువు ఎఫ్టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు చేశారని నాగార్జునకి చెందిన ఎన్ కన్వెన్షన్‌ను గతంలో హైడ్రా కూల్చేసిన సంగతి తెలిసిందే. రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధిలో గుడిసెలు కోల్పోయిన 34 మందికి ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను సీఎం అందజేయనున్నారు.ముఖ్యమంత్రి చేతుల మీదుగా పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను పంపిణీ చేస్తారు. తమ్మిడికుంట చెరువు అభివృద్ధికి ముందు దుర్గంధభరితంగా ఉండేది. నిర్మాణ వ్యర్థాలు, చెత్త, బయోమెడికల్ వ్యర్థాల డంపింగ్ యార్డుగా మారిన చెరువును హైడ్రా పునరుద్ధరణతో రూపురేఖలు



మార్చేసింది. చెరువులో 30 వేల ట్రక్కులకు పైగా పూడిక తొలగించింది. దుర్గంధభరిత వాతావరణం నుంచి ఆహ్లాదకరమైన వాతావరణంలోకి తమ్మిడికుంట చెరువు మారడం విశేషం.

చెరువు చుట్టూ 1.6 కిలోమీటర్ల మేర వాకింగ్ పాత్ ఏర్పాటు

సందర్శకుల కోసం అత్యాధునిక ఓపెన్ జిమ్ ఏర్పాటు

పిల్లల కోసం ప్రత్యేకంగా ఆటస్థలం ఏర్పాటు

చెరువు పరిసరాల్లో వేలాది

మొక్కలతో పచ్చదనం పెంపు

సందర్శకుల కోసం ప్రత్యేకంగా కూర్చునే వేదిక ఏర్పాటు

వేదిక మధ్యలో 60 ఏళ్ల బోన్సాయ్ మొక్క ప్రత్యేక ఆకర్షణ

వరద నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపునకు అనుకూలంగా చెరువు అభివృద్ధి

అనంతసాగర్ చెరువులో మొసళ్ల సంచారం..
భయాందోళనలో స్థానికులు

హైదరాబాద్ పెన్ పవసంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని అనంతసాగర్ చెరువులో మొసళ్ల సంచారం స్థానికంగా తీవ్ర భయాందోళనలు రేకెత్తిస్తోంది. చెరువు పరిసరాల్లో తరచూ మొసళ్లు కనిపిస్తుండటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాజాగా మంగళవారం నాడు కూడా చెరువు నడిబొడ్డున ఉన్న ఒక మట్టి దిబ్బపై మొసలి సేదతీరుతూ కనిపించడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.సుమారు వారం రోజుల క్రితం కూడా చెరువు సమీపంలోని రోడ్డుపై ఒక మొసలి వెళ్లడాన్ని వాహనదారులు, గ్రామస్తులు గమనించారు. వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటుండటంతో చెరువు పరిసర ప్రాంతాల్లో తిరగాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. ఈ చెరువు వద్దకు రైతులు తమ పశువులను నీటి కోసం తోలుకెళుతుంటారు. అలాగే నిత్యం గ్రామస్తుల రాకపోకలు కూడా ఇక్కడ ఎక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ఎటువైపు నుంచి మొసలి దాడి చేస్తుందోనని పశువుల కాపరులు, స్థానికులు తీవ్ర భయంతో గడుపుతున్నారు.ఇప్పటివరకు ఎలాంటి దాడులు గానీ, ప్రమాదాలు గానీ జరగనప్పటికీ.. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న భయం ప్రజలను వెంటాడుతోంది. మొసళ్లు నీటిలో నుంచి బయటకు వచ్చి రోడ్లపైకి సైతం సంచరిస్తుండటం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.ఈ పరిస్థితిపై అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. చెరువులో ఉన్న మొసళ్లను సురక్షితంగా పట్టుకుని, వాటిని సమీపంలోని మంజీరా నదిలోకి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుంటేనే తమకు, తమ పశువులకు రక్షణ ఉంటుందని స్థానిక రైతులు కోరుతున్నారు.

అండాల సేకరణలో అక్రమాలు అనేకం

-3 పేజి తరువాయి

అండాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొస్తున్న మహిళలకు ఎంతమేర డబ్బు చెల్లిస్తున్నారన్న కోణంపైనా అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ నెల 6న వైద్యాధికారులు దిల్లీకి వెళ్లి అక్కడి నేషనల్ ఏఆర్‌టీ అండ్ సరోగసీ రిజిస్ట్రీని సందర్శించారు. రాష్ట్రంలో నమోదైన ఏఆర్‌టీ కేంద్రాలు, ఏఆర్‌టీ బ్యాంకులకు సంబంధించిన పూర్తి వివరాలను కోరారు. ఈ సమాచారాన్ని అందజేస్తామని నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్(ఎన్ఐసీ) వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. మధ్యవర్తుల మాయమాటలు, ఆర్థిక ప్రలోభాలకు లోనై మహిళలు బలి కావద్దని వైద్య ఆరోగ్యశాఖ సూచించింది.

నకిలీ ఆధార్ కార్డులతో దందా!

నకిలీ ఆధార్ కార్డులను సృష్టించి నిరుపేద మహిళలకు డబ్బు ఆశచూపి హైదరాబాద్‌లోని కొన్ని ఐవీఎఫ్ కేంద్రాలు అక్రమంగా అండాలు సేకరిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో బయటపడింది. ఈ తరహా దందాకు తెరలేపిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరిగినా... అధికారులు మాత్రం ధ్రువీకరించలేదు. ఆయా ఐవీఎఫ్, ఏఆర్‌టీ కేంద్రాల పేర్లు వెలుగులోకి రాగా విచారణ కోసం వాటికి నోటీసులు జారీ చేశారు. ఈ కేంద్రాల్లో అండాలు దానం చేసిన మహిళల ఆధార్ కార్డులు, అంగీకార పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని పరిశీలించగా.. కొన్ని ఆధార్ కార్డులు నకిలీవని తేలింది.

ఓయూ విద్యార్థిని మృతి కేసు: బ్యాంక్ ఉద్యోగిని అరెస్ట్ చేసిన పోలీసులు

నల్లకుంట వద్ద రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ నగరంలోని నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి సమీపంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి చెందిన ఘటనపై పోలీసులు వేగంగా స్పందించారు. ఈ ప్రమాదానికి కారణమైన జాతీయ బ్యాంకు ఉద్యోగి బి.ఎం. ధర్మరాజును పోలీసులు అరెస్ట్ చేశారు.వివరాల్లోకి వెళితే.. 21 ఏళ్ల అయేషా ముస్ఫిరా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుతోంది. ఎప్పటిలాగే ఆమె తండ్రి ఆమెను కాలేజీకి తీసుకెళుతుండగా, ఫీవర్ ఆసుపత్రి సమీపంలో వీరి వాహనాన్ని మరో వాహనం ఢీకొట్టింది. నిందితుడైన బ్యాంకు ఉద్యోగి ధర్మరాజు నిర్లక్ష్యంగా రాంగ్ రూట్‌లో వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తేలింది. ఈ దుర్ఘటనలో తీవ్రంగా గాయపడిన అయేషా ముస్ఫిరా కళ్లెదుటే ప్రాణాలు విడవడంతో ఆ తండ్రి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.ఈ ఘటనపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఆయన స్పందిస్తూ.. కేవలం రెండు నిమిషాల సమయం ఆదా చేసుకునేందుకు రాంగ్ రూట్‌లో వెళ్లి ఒక యువతి నిండు ప్రాణాన్ని బలిగొన్నారని విచారం వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదివిన విద్యావంతులు కూడా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం తీవ్ర మనస్తాపానికి గురిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.రోడ్లపై ప్రయాణించే సమయంలో వాహనదారులు సంయమనం పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. స్వల్ప సమయం కోసం చూసుకుని ఎదుటివారి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని ఆయన హెచ్చరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

షామీర్‌పేట సమీపంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

హైదరాబాద్ పెన్ పవర్:మేడ్చల్ జిల్లా కొంపల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గౌరీ శంకర్ వరప్రసాద్ (52) షామీర్‌పేట పరిధిలో సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. ముంచింతలపల్లి సమీపంలోని లక్ష్మాపూర్ చెరువు కట్ట వద్ద ఆయన గుర్తుతెలియని పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.షామీర్‌పేట పోలీసుల వివరాల ప్రకారం.. గౌరీ శంకర్ వరప్రసాద్ గత కొంతకాలంగా రియల్ ఎస్టేట్ రంగంలో వ్యాపారం నిర్వహిస్తున్నారు. అయితే, ఆయన పెట్టిన పెట్టుబడులు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడంతో తీవ్రమైన ఆర్థిక సమస్యల్లో చిక్కుకున్నారు. అప్పులు పెరిగిపోవడం, వ్యాపారంలో నష్టాలు రావడంతో గత కొద్ది రోజులుగా ఆయన తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.ఈ ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు ప్రత్యామ్నాయంగా పౌల్ట్రీ ఫామ్ ఏర్పాటు చేయాలని వరప్రసాద్ భావించారు. ఆ వ్యాపారానికి తగిన స్థలాన్ని వెతికే క్రమంలో ఆయన తన ద్విచక్ర వాహనంపై షామీర్‌పేట పరిసర ప్రాంతాలకు వెళ్లారు. లక్ష్మాపూర్ చెరువు కట్ట సమీపంలో ఆయన సంచరిస్తుండటాన్ని స్థానిక గ్రామస్తులు చివరిసారిగా గమనించారు. ఆ తర్వాత తీవ్ర నిరాశతో ఆయన వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగినట్లు తెలుస్తోంది.

చెరువు కట్ట వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న వరప్రసాద్‌ను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న శామీర్‌పేట పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆయన ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని, ఘటనపై కేసు నమోదు చేసుకుని పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో నేల ఆరోగ్యం



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి రామారావు



జీవామృతం తయారీ పై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి రామారావు

గార్ల, పెన్ పవర్, నవంబర్ 10:రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించుకొని, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ సేంద్రియ సాగు వైపు అడుగులు వేయాలని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు సూచించారు. మంగళవారం గార్ల మండల పరిధిలోని శేరిపురం రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ గుగులోత్ భారతి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. నేలలో సేంద్రియ కార్బన్ శాతం పెరిగి భూమి మరింత సారవంతంగా మారుతుందని, పంటల ఎదుగుదలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని వివరించారు.విచక్షణారహితంగా రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా జీవామృతం, ఘన జీవామృతం, నీమాస్త్రం, దశపర్ణి కషాయం వంటి ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ద్రావణాలను వినియోగించాలని రైతులకు సూచించారు. తద్వారా నేల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.అనంతరం రైతులకు వ్యవసాయ క్షేత్రంలో క్షేత్రస్థాయి శిక్షణ ఇచ్చారు. జీవామృతం, ఘన జీవామృతం తయారీ విధానంతో పాటు వాటిని పంటలకు పిచికారీ చేసే పద్ధతులను వివరించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజ్యలక్ష్మి, ఇరిగేషన్ ఏఈ భరత్, ఉప సర్పంచ్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

అకౌంటింగ్ ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజు

గార్ల, పెన్ పవర్, నవంబర్ 10: మహబూబాబాద్ జిల్లా గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అకౌంటింగ్ ప్రాధాన్యత, వ్యాపార రంగంలో దాని ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రాజు మాట్లాడుతూ అకౌంటింగ్‌లో జంట పద్దు విధానం (డెబిట్, క్రెడిట్) ఎంతో కీలకమని, వ్యక్తిగత, వ్యాపార కార్యకలాపాల్లో ఆర్థిక లావాదేవీలను క్రమబద్ధంగా నిర్వహించేందుకు అకౌంటింగ్ దోహదపడుతుందని వివరించారు. 1972 నవంబర్ 10న కాలిఫోర్నియా యూనివర్సిటీలో తొలిసారిగా అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. 1494లో ప్రముఖ గణిత శాస్త్రవేత్త లూకా పాసియోలీ రచించిన ‘సుమ్మా డి అరిథ్మెటికా’ గ్రంథం ద్వారా జంట పద్దు విధానాన్ని ప్రపంచానికి పరిచయం చేశారని పేర్కొన్నారు. అకౌంటింగ్ రంగంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. రామ్మోహన్ రావు, కామర్స్ హెచ్ఓడీ బి. పున్నంచందర్, ఎం. వీరన్న, ఏ. రాజేష్, సి.హెచ్. వెంకటేశం, స్వరూపరాణి, ఎం. మేఘన, ఎస్. లావణ్య, అనురాధ, సహన, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఢిల్లీతో పోటీపడుతున్న భాగ్యనగరం!

హైదరాబాద్, నవంబరు 10, పెన్ పవర్:
ఒకప్పుడు ప్రశాంత వాతావరణానికి చిరునామాగా ఉన్న హైదరాబాద్ నగరం ఇప్పుడు వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దేశ రాజధాని ఢిల్లీని తలపించేలా గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నగరం మొత్తం మీద ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 410గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ స్థాయి కాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.తాజా గణాంకాల ప్రకారం.. గాలిలోని అతి సూక్ష్మ ధూళి కణాలైన పీఎం 2.5 స్థాయిలు సురక్షిత పరిమితి అయిన 60 మైక్రోగ్రాములకు బదులుగా 278 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. అదేవిధంగా పీఎం 10 పరిమితి 100 మైక్రోగ్రాములు కాగా, ప్రస్తుతం 326 మైక్రోగ్రాములుగా ఉంది. ఇది సాధారణం కంటే దాదాపు మూడు నుంచి నాలుగు రెట్లు అధికం. ఈ స్థాయిలో కాలుష్యం కొనసాగితే ప్రజల ఆరోగ్యంపై, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం పడుతుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నగరంలోని అన్ని ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఉన్నప్పటికీ, ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డిఫెన్స్ కాలనీలో ూూ× ఏకంగా 685గా రికార్డయింది. శేరిలింగంపల్లిలో 666, మణికొండలో 602, యాంబియన్స్ ఫోర్ట్‌లో 596, ఎన్‌బీటీ నగర్‌లో 582గా కాలుష్య సూచీ నమోదైంది. ఈ ప్రాంతాలు కాలుష్య హాట్‌స్పాట్‌లుగా మారుతుండటం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది.హైదరాబాద్‌లో గాలి నాణ్యత ఇంతలా క్షీణించడానికి ప్రధాన కారణాలు పెరిగిన వాహనాల రద్దీ, అదుపులేని నిర్మాణ కార్యకలాపాలు, రోడ్లపై పేరుకుపోయిన దుమ్ముధూళి, పారిశ్రామిక ఉద్గారాలేనని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో నిరంతరాయంగా సాగే నిర్మాణాలు, వాహనాల రాకపోకలు కాలుష్య తీవ్రతను మరింత పెంచుతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని పౌరులు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు. రోడ్లను నీటితో శుభ్రపరచడం, నిర్మాణ ప్రాంతాల్లో దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవడం, వాహన కాలుష్య తనిఖీలను కఠినతరం చేయడం వంటివి వెంటనే ప్రారంభించాలని సూచిస్తున్నారు. లేకపోతే హైదరాబాద్ కూడా ఢిల్లీ లాగా గ్యాస్ ఛాంబర్‌గా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోతుల దాడితో మిర్చి, పత్తి పంటలు ధ్వంసం

రైతులను ఆదుకోవాలి.. పరిహారం అందించాలి: వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



కోతులతో నష్టపోయిన రైతు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



పంట నష్టాన్ని చూపుతున్న రైతు

గార్ల, పెన్ పవర్, నవంబర్ 10: కోతుల బెడదతో పంటలు చేతికందకుండా పోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం ముల్కనూరు గ్రామంలో కోతుల గుంపులు పంటలపై దాడి చేస్తూ తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. గ్రామానికి చెందిన రైతు గుండ్లపెల్లి వీరన్న సాగు చేసిన మిర్చి, పత్తి పంటలను కోతులు పూర్తిగా ధ్వంసం చేయడంతో పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి నెలకొంది.వీరన్న తనకున్న భూమిలో ఎకరం మిర్చి, మరో ఎకరం పత్తి సాగు చేసేందుకు వడ్డీలకు అప్పులు తెచ్చి సుమారు రూ.2.5 లక్షలు పెట్టుబడి పెట్టాడు. పంటలు చేతికొచ్చే సమయంలో కోతుల గుంపులు తోటలపై దాడి చేసి మిర్చి కాయలను తెంపి పడేయడంతోపాటు పత్తి పంటను సైతం నాశనం చేశాయి. దీంతో తీవ్రంగా నష్టపోయిన రైతు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.కోతుల బెడద పొలాలకే పరిమితం కాకుండా గ్రామంలోని ఇళ్లలోకి చొరబడి వంట సామగ్రి, బియ్యం, కూరగాయలను ఎత్తుకెళ్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. కోతుల భయంతో ఇళ్లలో సైతం ప్రశాంతంగా ఉండలేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వ్యవసాయం చేయలేక రైతులు గ్రామాలను విడిచి పట్టణాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నష్టపోయిన మిర్చి, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాధిత రైతు వీరన్నను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, పంట నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు వాటిని సురక్షితంగా అడవుల్లోకి తరలించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా నాయకులు గడ్డిపాటి రాజారావు, మండల కమిటీ సభ్యులు బొబ్బ ఉపేందర్ రెడ్డి, గుండేటి వీరభద్రం, గిరిజన సంఘం నాయకులు కవి బాబు, రైతు సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.



కోతుల వల్ల ధ్వంసం అయిన పంట

నకిలీ పత్రాలతో బ్యాంకుకు రూ.30 లక్షల టోకరా..ముఠా గుట్టురట్టు!

- నకిలీ ఆధార్, పాన్, ఉద్యోగ పత్రాలతో రుణం పొందిన వైనం
- రుణం మంజూరుకు రూ.6.70 లక్షల కమీషన్
- రూ.3 లక్షల క్రెడిట్ కార్డు పరిమితి కూడా స్వాహా

ఇబ్రహీంపట్నం, పెన్ పవర్, నవంబర్ 10:
నకిలీ గుర్తింపు, ఉద్యోగ ధ్రువీకరణ పత్రాలతో బ్యాంకును బురిడీ కొట్టించి రూ.30 లక్షల రుణం పొందిన మోసపూరిత వ్యవహారాన్ని ఇబ్రహీంపట్నం పోలీసులు వెలుగులోకి తెచ్చారు. నకిలీ ఆధార్, పాన్ కార్డులతో పాటు ఉద్యోగ నియామక పత్రాలు, జీతపు స్లిప్పులు సృష్టించి ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.
విచారణ ప్రకారం.. రామావత్ గోపాల్, పులి సురేష్ బాబు కలిసి గంటల శంకర్ పేరుతో నకిలీ పత్రాలు తయారు చేశారు. వాటి ఆధారంగా బెంగళూరులోని క్యాప్కో టెక్నాలజీస్ సంస్థలో సీనియర్ కన్సల్టెంట్‌గా ఉద్యోగం పొందినట్లు చూపించారు. అనంతరం అదే పత్రాలతో ఐసీఐసీఐ బ్యాంకులో గంటల శంకర్ పేరుతో రూ.30 లక్షల రుణం ద
మంజూరు చేయించుకున్నారు. ఈ వ్యవహారంలో రామావత్ సురేష్‌కు రూ.6.70 లక్షలు కమీషన్‌గా చెల్లించినట్లు, నిందితులు డబ్బులు పంచుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా, గంటల శంకర్ పేరుతో పొందిన క్రెడిట్ కార్డుపై ఉన్న రూ.3 లక్షల పరిమితిని కూడా రామావత్ సురేష్ వినియోగించుకున్నట్లు వెల్లడైంది. నకిలీ పత్రాల తయారీ, వాటి ద్వారా ఉద్యోగం పొందడం, బ్యాంకు రుణం తీసుకోవడం వంటి అంశాలపై పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇతరుల గుర్తింపు వివరాలను దుర్వినియోగం చేయడం, నకిలీ పత్రాలతో రుణాలు పొందడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

హైదరాబాద్ వాసుల తాగునీటి కష్టాలకు చెక్?

హైదరాబాద్, నవంబర్ 10, పెన్ పవర్:
ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో సింగూరు--మంజీరా జలవనరుల్లో నీటి లభ్యత తగ్గుతున్న దృష్ట్యా హైదరాబాద్ నగరానికి తాగునీటి సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా జలమండలి ముందస్తు చర్యలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా రోజుకు 40 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీ) గోదావరి అదనపు జలాలను నగరానికి తరలించేందుకు ఘన్‌పూర్ వద్ద చేపడుతున్న పైప్‌లైన్ అనుసంధాన పనులను జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నవంబర్ 15వ తేదీలోగా పైప్‌లైన్ అనుసంధాన పనులు పూర్తి చేసి, గోదావరి జలాలను సరఫరా చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువును ఒక్కరోజు కూడా పొడిగించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.పైప్‌లైన్ నిర్మాణ పనులను రెండు వైపుల నుంచి సమాంతరంగా చేపట్టి, నిర్ణీత గడువులోగా అనుసంధానం చేయాలని ఎండీ ఆదేశించారు. ఏ నిర్మాణ సంస్థ ఎంత దూరం పైప్‌లైన్ ఏర్పాటు చేసిందనేది ముఖ్యం కాదని, పనులు పూర్తయి పైప్‌లైన్ అనుసంధానం కావడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పనుల పరిధికి సంబంధించిన బిల్లుల సర్దుబాటును తర్వాత పరిశీలించవచ్చని, ప్రస్తుతం పనుల పూర్తికే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.పైప్‌లైన్ అనుసంధాన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు రోజుకు ఎనిమిది గంటల చొప్పున మూడు షిఫ్టుల్లో ప్రత్యేక కార్మిక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి షిఫ్టుకు వేర్వేరు బృందాలను నియమించి, పగలు రాత్రి తేడా లేకుండా
నిరంతరాయంగా పనులు కొనసాగించాలన్నారు. రాత్రివేళ పనులకు అవసరమైన ఫ్లడ్‌లైట్లు, యంత్ర సామగ్రి, ఇతర సౌకర్యాలను సమకూర్చుకోవాలని సూచించారు.పైప్‌లైన్ అనుసంధానానికి కీలకమైన రోడ్డు క్రాసింగ్ పనులను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని ఎండీ ఆదేశించారు. అవసరమైన అనుమతులు, భద్రతా ఏర్పాట్లతో రాత్రి నుంచే రోడ్డు కటింగ్ పనులు ప్రారంభించి, రెండు మూడు రోజుల్లో పైపుల ఏర్పాటుకు మార్గం సుగమం చేయాలని సూచించారు. ఇందుకోసం అదనంగా రెండు మూడు ప్రత్యేక కార్మిక బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు.గోదావరి జలాల తరలింపునకు చేపడుతున్న పనులను వేగవంతం చేసేందుకు మిషన్ భగీరథ, అటవీశాఖల అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. పైప్‌లైన్ అనుసంధానానికి అవసరమైన సాంకేతిక సహకారం, యంత్రాలు, మానవ వనరులను ఆయా శాఖల సహకారంతో సమకూర్చుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న గోదావరి ప్రాజెక్టు పనుల్లో నిమగ్నమైన సాంకేతిక నిపుణులు, కార్మిక బృందాలు, ఎక్స్‌కవేటర్లు, డ్రిల్లింగ్ యంత్రాలు, ఇతర భారీ యంత్ర సామగ్రిని అవసరమైన మేరకు ఈ పనులకు మళ్లించాలని సూచించారు. అవసరమైతే ఇతర ప్రాంతాల్లో
కొనసాగుతున్న పనులను తాత్కాలికంగా నిలిపివేసి, అక్కడి యంత్రాలు, వాహనాలు, సిబ్బందిని ఈ ప్రాజెక్టుకు వినియోగించుకోవాలన్నారు.రాబోయే వేసవి కాలంలో తాగునీటి అవసరాలు పెరిగే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థంగా వినియోగించుకోవాలని ఎండీ సూచించారు. ముఖ్యంగా సింగూరు--మంజీరా జలవనరులపై ఆధారపడిన ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా గోదావరి జలాలను అందించే ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పైప్‌లైన్ అనుసంధాన పనుల పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షించాలని, ఎదురయ్యే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు సకాలంలో పూర్తికావడం జలమండలి ప్రతిష్ఠకు సంబంధించిన అంశమని, అధికారులు, నిర్మాణ సంస్థలు పూర్తి బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు.నవంబర్ 15వ తేదీలోగా పైప్‌లైన్ అనుసంధాన పనులు పూర్తి చేసి, రోజుకు 40 ఎంజీడీల గోదావరి అదనపు జలాల సరఫరాకు మార్గం సుగమం చేయాలని ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు

ఖమ్మం రూరల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. భార్య మృతి, భర్తకు గాయాలు

సిమెంట్ మిక్సర్ లారీ ఢీకొని మహిళ దుర్మరణం.. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్



ఖమ్మం, పెన్ పవర్, నవంబర్ 10 : ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట బైపాస్ రోడ్డు జంక్షన్‌లో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన సిమెంట్ మిక్సర్ లారీ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో ఓ మహిళ ప్రాణాలు కోల్పోగా, ఆమె భర్త గాయాలతో బయటపడ్డారు.వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం నగరంలోని బల్లేపల్లి ప్రాంతానికి చెందిన తుమ్మల అమృత (45), తన భర్త బాలరాజుతో కలిసి వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంలో ఖమ్మం రూరల్ ప్రాంతానికి వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి ఖమ్మం వైపు వెళ్తున్న క్రమంలో నాయుడుపేట బైపాస్ జంక్షన్ వద్ద టర్నింగ్ తీసుకుంటుండగా సిమెంట్ మిక్సర్ లారీ వారి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అమృత తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె భర్త బాలరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంతో అక్కడ కలకలం రేగింది. స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు.

ప్రమాదాలకు అడ్డుకట్ట ఎప్పుడు

నాయుడుపేట బైపాస్ జంక్షన్‌తో పాటు వరంగల్ క్రాస్‌రోడ్డు వద్ద నిత్యం భారీగా వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ముఖ్యంగా భారీ వాహనాల రాకపోకలు, జంక్షన్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణ లోపం వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాయుడుపేట బైపాస్, వరంగల్ క్రాస్‌రోడ్డు జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరో కుటుంబంలో ఇలాంటి విషాదం చోటుచేసుకోకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ బోర్ల నిర్వహణ

నీటి సరఫరాపై కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారుల హెచ్చరిక



కాప్రా, పెన్ పవర్, నవంబర్ 10: ఉప్పల్ నియోజకవర్గం కాప్రా మండల పరిధిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన బోర్‌వెల్స్, అక్రమంగా బోరు నీటిని సరఫరా చేస్తున్న వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన తనిఖీల్లో రెండు అనుమతి లేని బోర్‌వెల్స్‌తో పాటు, అక్రమంగా నీటి సరఫరా చేస్తున్న తొమ్మిది పైప్‌లైన్లను అధికారులు సీజ్ చేశారు. కాప్రా వెస్ట్రన్ హిల్స్ ప్రాంతంలో రెండు అనుమతి లేని బోర్‌వెల్స్‌ను గుర్తించి సీజ్ చేయగా, మాణిక్యేశ్వర నగర్‌లో నాలుగు, ఎల్లారెడ్డిగూడలో నాలుగు, దుర్గానగర్‌లో ఒకటి చొప్పున మొత్తం తొమ్మిది అక్రమ బోరు నీటి సరఫరా పైప్‌లైన్లను సీజ్ చేశారు. ఈ చర్యలను కాప్రా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు



మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులు లేకుండా బోర్‌వెల్స్ ఏర్పాటు చేయడం, అక్రమంగా బోరు నీటిని సరఫరా చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే చట్టపరమైన చర్యలకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. మండల పరిధిలో అక్రమ బోర్లపై తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

శివాలయాలకు కార్తీక శోభ
భక్తి శ్రద్ధలతో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు



అలంకరణలో శివలింగం

గార్ల పెన్ పవర్ నవంబర్ 10: కార్తీక మాస మహోత్సవాలను పురస్కరించుకొని గార్ల మండలంలోని పలు శివాల యాలకు కార్తీక శోభ సంతరించుకుంది. మహిళలు భక్తులు శివయ్యను దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్తీక మాసం ప్రారంభం కావడంతో గార్ల మండల కేంద్రంలోని స్థానిక భవాని సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు సంగునూరి ప్రవీణ్ కుమార్ శర్మ స్వామివారిని పూలు, మారేడు దళాలతో సర్వాంగ సుందరంగా అలంకరిం చారు. ఏకాదశి రుద్రాభిషేకం పంచామృతాభిషేకాలతోవిశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి విచ్చేసి భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణలు చేసి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్న భక్తజనం పెద్ద ఎత్తున శివ నామాన్ని స్మరించడంతో శివా లయం మొత్తం శివ నామస్మరణతో మార్మోగింది.

సిపిఐ(ఎం) సీనియర్ నాయకుడు బుచ్చిరాములుకు కన్నీటి వీడ్కోలు

ఎర్రజెండా కప్పి విప్లవ నివాళులర్పించిన తమ్మినేని వీరభద్రం.. పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకుల ఘన నివాళి





సిపిఐ (ఎం)సీనియర్ నాయకుడు బుచ్చి రాములు నివాళులర్పిస్తున్న సిపిఐ ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం

ఖమ్మం, పెన్ పవర్, నవంబర్ 11 :ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లికి చెందిన సిపిఐ(ఎం) సీనియర్ నాయకుడు గొడ్డుగొర్ల బుచ్చిరాములు అనారోగ్యంతో మృతి చెందారు. ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారు.
ఆయన మరణవార్త తెలుసుకున్న సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, తన సోదరుడు తమ్మినేని వెంకట్రావుతో కలిసి మంగళవారం ఉదయం మద్దులపల్లిలోని బుచ్చిరాములు స్వగృహానికి చేరుకున్నారు. ఆయన పార్థివదేహంపై ఎర్రజెండా కప్పి, పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

రాష్ట్ర, జిల్లా నాయకుల ఘన నివాళి

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు నండ్ర ప్రసాద్, సీఐటీయూ జిల్లా నాయకులు షేక్ బషీరుద్దీన్, పెరుమాళ్లపల్లి మోహన్ రావు, ప్రజానాట్యమండలి పాలేరు డివిజన్ కార్యదర్శి నందిగామ కృష్ణ, ఏటుకూరి ప్రసాదరావు, కస్తాల ఆంటోనీ, రూరల్ మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు తదితరులు బుచ్చిరాములు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

బుచ్చిరాములు మృతి పట్ల కేవీపీఎస్ సంతాపం

గొడ్డుగొర్ల బుచ్చిరాములు మృతి పట్ల కేవీపీఎస్ ఖమ్మం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. మంగళవారం ఆయన స్వగృహం వద్ద కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్, జిల్లా ఉపాధ్యక్షులు పాపిట్ల సత్యనారాయణ, జిల్లా నాయకులు రెడపంగి ప్రకాష్, ఏపూరి వరకుమార్, పగిడిపల్లి వెంకట్రావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చిన్ననాటి మిత్రులను శోకసంద్రంలో ముంచిన మరణం

చిన్ననాటి నుంచి కలిసిమెలిసి పెరిగిన మిత్రుడు బుచ్చిరాములు అకాల మరణం చెందడంతో స్నేహితులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు. బుచ్చిరాములుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.
ఈ కార్యక్రమంలో మద్దులపల్లి సిపిఐ(ఎం) శాఖ కార్యదర్శి పెంట్యాల నాగేశ్వరరావు, కర్లపూడి వెంకటేశ్వర్లు, తూమాటి నాగేశ్వరరావు, ఉదయ్, తెల్దారుపల్లి గ్రామ శాఖ కార్యదర్శి మల్లెబోయిన రాజశేఖర్, మండల కమిటీ సభ్యులు డాక్టర్ మడిపల్లి వెంకన్న, పగిడిపల్లి ఉపేందర్, గుంటి వెంకన్న, మల్సూర్, బీఆర్ఎస్ నాయకులు నల్లపునేని భాస్కర్ రావు, రమణయ్య, కాంగ్రెస్ నాయకులు ఏటుకూరి సుధాకర్, అయితగాని అంజయ్య, గొడ్డుగొర్ల గురునారాయణ, సీపీఐ నాయకులు ఉన్నం రంగారావు, రెంటాల శ్రీరాములు, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు

ఊరు వాడ కదలాలి.. రైతు మహాసభకు తరలిరావాలి

నవంబర్ 15న నల్గొండలో జరిగే(ఏ ఐ కె ఎస్) బహిరంగ సభను జయప్రదం చేయండి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు పిలుపు



ఖమ్మం, పెన్ పవర్ నవంబర్ 11 :నవంబర్ 15న నల్గొండలో నిర్వహించనున్న అఖిల భారత రైతు సంఘం(ఏ ఐ కె ఎస్)బహిరంగ సభను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జరిగే ఈ మహాసభకు రైతులు, వ్యవసాయ కార్మికులు, కూలీలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో ఉన్న తమ్మినేని సుబ్బయ్య భవనంలో రైతు సంఘం నాయకులు నండ్ర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన పాలేరు డివిజన్ విస్తృతస్థాయి సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.దేశ వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లభించక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయని విమర్శించారు. ఎరువుల కొరత, పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు, సాగునీరు, విద్యుత్ సమస్యలు రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు.రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధర కల్పించాలని, పంటలకు గిట్టుబాటు ధరలు అమలు చేయాలని, వ్యవసాయ రంగ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కుల సాధన కోసం ఐక్య ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఊరికో బస్సు ఇంటికో మనిషి

నల్గొండలో జరిగే బహిరంగ సభ రైతాంగ ఐక్యతకు, హక్కుల సాధన పోరాటానికి వేదికగా నిలవాలని నాయకులు ఆకాంక్షించారు. పాలేరు డివిజన్‌లోని అన్ని గ్రామాల నుంచి “ఊరికో బస్సు.. ఇంటికో మనిషి” అనే నినాదంతో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పాలేరు డివిజన్ రైతు సంఘం అధ్యక్షుడు గూడవర్తి నాగేశ్వరరావు, కార్యదర్శి బిక్కసాని గంగాధర్, బండి రమేష్, షేక్ బషీరుద్దీన్, ఊరడి సుదర్శన్ రెడ్డి, వడ్లమూడి నాగేశ్వరరావు, నందిగామ కృష్ణ, కస్తాల ఆంటోనీ, ఏటుకూరి ప్రసాదరావు, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, భూక్యా నాగేశ్వరరావు, పొన్నం వెంకటరమణ, తోటకూరి, రాజు, మల్లెబోయిన రాజశేఖర్, డాక్టర్ మడిపల్లి వెంకన్న, పగిడిపల్లి వెంకట్రావు మహిళా నాయకురాళ్లు బుగ్గవీటి సరళ సుమతి తదితరులు పాల్గొన్నారు

ఆర్టీఐ సమాచారంపై కాప్రా సబ్‌రిజిస్ట్రార్‌కు ప్రశ్నల వర్షం

భూముల రికార్డులు, 22(ఏ) నిషేధిత జాబితా వివరాలేవీ?

కోరిన సమాచారం ఇవ్వకుండా వెబ్‌సైట్ వైపు చూపుతున్నారంటూ ఆప్ నేత బోట్ల సాయిలు ఆరోపణ

కాప్రా, పెన్ పవర్, నవంబర్ 10: కాప్రా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని భూములకు సంబంధించిన కీలక రికార్డులపై సమాచార హక్కు చట్టం--2005 కింద దరఖాస్తు చేసినప్పటికీ, కోరిన సమాచారం పూర్తిస్థాయిలో అందడం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోట్ల సాయిలు ఆరోపించారు. ఈ మేరకు ఆయన కాప్రా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆర్టీఐ దరఖాస్తులు సమర్పించారు. కాప్రా పరిధిలోని పలు భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ వివరాలు, భూముల రికార్డులు, సర్వే నంబర్లు, సెక్షన్ 22(ఏ) కింద గెజిట్ నోటిఫికేషన్ నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాలను ఆయన కోరారు. సంబంధిత భూములకు సంబంధించి కార్యాలయంలో అందుబాటులో ఉన్న రికార్డుల ధ్రువీకృత ప్రతులను కూడా అందించాలని దరఖాస్తుల్లో విజ్ఞప్తి చేశారు.అయితే తాను కోరిన కొన్ని అంశాలకు సంబంధించిన సమాచారాన్ని అధికారులు అందించకుండా వెబ్‌సైట్‌లో పరిశీలించాలంటూ సూచిస్తున్నారని బోట్ల సాయిలు పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రజలు కోరిన సమాచారాన్ని నిబంధనలకు అనుగుణంగా అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ఆయన అన్నారు.భూముల రిజిస్ట్రేషన్లు, నిషేధిత జాబితా వంటి కీలక అంశాల్లో పారదర్శకత అవసరమని పేర్కొంటూ, తాను సమర్పించిన ఆర్టీఐ దరఖాస్తులపై సమగ్రంగా స్పందించి కోరిన సమాచారాన్ని అందించాలని కాప్రా సబ్‌రిజిస్ట్రార్ పాండురంగారెడ్డిని బోట్ల సాయిలు కోరారు.

లోన్ యాప్ వేధింపులు కానిస్టేబుల్ బలవన్మరణం

రూ.40 వేల అప్పు కోసం అసభ్యకర బెదిరింపులు


నగ్న చిత్రాలు పంపుతామంటూ వేధింపులు



హైదరాబాద్, పెన్ పవర్, నవంబర్ 10: లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు మరో నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. అప్పు తిరిగి చెల్లించలేదనే కారణంతో చేసిన బెదిరింపులు తట్టుకోలేక ఓ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది.హైదరాబాద్‌లోని కొండాపూర్ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీను (31) నాలుగు నెలల క్రితం ఓ లోన్ యాప్ ద్వారా రూ.40 వేల రుణం తీసుకున్నాడు. సకాలంలో వాయిదాలు చెల్లించకపోవడంతో యాప్ నిర్వాహకుల నుంచి వేధింపులు ప్రారంభమైనట్లు సమాచారం. కుటుంబ సభ్యులకు నగ్న చిత్రాలు పంపిస్తామంటూ అసభ్యకరంగా బెదిరించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీను ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది.ఈ ఘటనపై పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సులభంగా రుణాలు ఇస్తామంటూ ఆకర్షించి, ఆ తర్వాత వేధింపులకు పాల్పడుతున్న లోన్ యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది.

ఖమ్మం జిల్లాలో దారుణ హత్య

వివాహేతర సంబంధాన్ని చూసినందుకు 15 ఏళ్ల బాలుడి హతం



ఖమ్మం, పెన్ పవర్, నవంబర్ 10 : ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చిన్నకొరుకొండ గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. తమ వివాహేతర సంబంధాన్ని చూశాడనే కారణంతో పదవ తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలుడు రవిని ఓ మహిళ, యువకుడు కలిసి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు.వివరాల్లోకి వెళ్తే.. భర్తతో విడిపోయిన అపర్ణ అనే మహిళ చిన్నకొరుకొండలోని తన అమ్మమ్మ ఇంట్లో నివసిస్తోంది. అదే గ్రామానికి చెందిన అజయ్‌తో ఆమెకు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ క్రమంలో వారిద్దరూ ఏకాంతంగా ఉండటాన్ని గమనించిన రవి, ఈ విషయం కుటుంబ సభ్యులకు చెబుతానని హెచ్చరించినట్లు సమాచారం.దీంతో బాలుడిని అడ్డు తొలగించుకోవాలని ఇద్దరూ కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. గత నెల 24న రవిని గ్రామ శివారుకు తీసుకెళ్లి కూల్‌డ్రింక్‌లో కలుపు మందు కలిపి తాగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన బాలుడిని కుటుంబ సభ్యులు 25న ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో రవి మృతిచెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులైన అపర్ణ, అజయ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రాజన్న ఆలయంలో కార్తీక మాసోత్సవాలు..

నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు

వేములవాడ:పెన్ పవర్, నవంబర్ 10 : కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, ఉత్సవాల నిర్వహణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. నవంబర్ 10 నుంచి డిసెంబర్ 8వతేదీ వరకు నెలరోజుల

పాటు కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నారు. కార్తీక సోమవారాలు, పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. అయితే రాజన్న ఆలయఅభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాన ఆలయంలో స్వామివారికి ఏకాంతంగా పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి.

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని రాజన్న

ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలోనూ నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు జరగనున్నాయి. కార్తీక మాసంలోని ప్రతి సోమవారం ప్రధాన ఆలయంలో శ్రీ రాజరాజేశ్వర

స్వామివారికి ఏకాంతంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. అదేవిధంగా శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలోనూ స్వామివారికి రుద్రాభిషేకం జరపనున్నారు. ఈ నెల 21వ తేదీన కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభ స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం శ్రీకృష్ణ తులసి కల్యాణం జరగనుంది. అలాగే నవంబర్ 24న కార్తీక పౌర్ణమి,వైకుంఠ చతుర్దశి సందర్భంగా ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అన్నపూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్తీక పౌర్ణమి రోజున శ్రీ భీమేశ్వర స్వామి

ఆలయం వద్ద సంప్రదాయబద్ధంగా జ్వాలాతోరణం కార్యక్రమం నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి ప్రధాన ఆలయంలో నిషిపూజ అనంతరం ప్రత్యేక పూజలు జరగనున్నాయి. కార్తీక మాసంలో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో అందుకు అనుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ఆలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో ప్రధాన ఆలయంలో స్వామివారికి ఏకాంతంగా పూజలు కొనసాగనున్నాయి. భక్తులు ఆలయ అధికారుల సూచనలు పాటిస్తూ దర్శన ఏర్పాట్లకు సహకరించాలని ఆలయ వర్గాలు కోరుతున్నాయి.

అశోక్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్తకుప్పలు

పారిశుధ్య నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం.. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఆరోపణలు

చెత్త తొలగింపుపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడి విజ్ఞప్తి



కాప్రా, పెన్ పవర్, నవంబర్ 10: అశోక్‌నగర్ కాలనీలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, రహదారులపై చెత్త పేరుకుపోతున్నా సంబంధిత సిబ్బంది పట్టించుకోవడం లేదని హెచ్‌బీ కాలనీ 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొకుట్ల రూపేందర్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఉదయం నుంచి ఇప్పటివరకు కాలనీలోని పలు ప్రాంతాల్లో చెత్త తొలగించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని

తెలిపారు.అశోక్‌నగర్ కాలనీలో ఎంఎంసీ సూపర్‌వైజర్ లలిత విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదని ఆయన విమర్శించారు. ఈ విషయంపై ఇప్పటికే ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.కాలనీలో ప్రతిరోజూ పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని జవాన్ గారికి మరోసారి విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదులపై స్పందించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కొకుట్ల రూపేందర్ రెడ్డి కోరారు

సంస్కృతి.. సంప్రదాయాల నడుమ దీపావళి సంబరాలు!

డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా వేడుకలు

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు.. నరకాసుర వధ నాటకం ప్రత్యేక ఆకర్షణ





కాప్రా పెన్ పవర్, నవంబర్ 10: నాచారంలోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో దీపావళి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల రంగవల్లులు,

సంప్రదాయ దీపాలతో అలంకరించి పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు.ఈ వేడుకలకు పాఠశాల చైర్మన్ కె. నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, డైరెక్టర్ డాక్టర్ కమలా మనోహర్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కోర్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఫణి మాధవి, కోర్ టీమ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, గాన కార్యక్రమాలు అలరించాయి. దీపావళి పండుగ విశిష్టతను తెలియజేస్తూ విద్యార్థులు ఇచ్చిన సందేశాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ప్రైమరీ విద్యార్థులు ప్రదర్శించిన 'నరకాసుర వధ' నాటకం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థుల ప్రతిభను ముఖ్య అతిథులు, ఉపాధ్యాయులు అభినందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఫణి మాధవి మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని అన్నారు. ప్రతి ఒక్కరూ నీతి, నిజాయితీ మార్గంలో నడుస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.విద్యుత్‌తోపాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడంలో డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.విద్యార్థులు, ఉపాధ్యాయుల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో పాఠశాల ప్రాంగణమంతా దీపావళి సందడి నెలకొంది. ఆనందోత్సాహాల మధ్య వేడుకలు ఘనంగా ముగిశాయి.

అశోక్ నగర్‌లో తీరని డ్రైనేజీ సమస్య

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ఏఈ రోహిత్ స్పందించాలని కాంగ్రెస్ నేత రూపేందర్ రెడ్డి విజ్ఞప్తి



కాప్రా, పెన్ పవర్, నవంబర్ 10: ఉప్పల్ నియోజకవర్గం హెచ్‌బీ కాలనీ 19వ డివిజన్ పరిధిలోని అశోక్ నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తోంది. సమస్య పరిష్కారం కోరుతూ సంబంధిత ఏఈ రోహిత్‌కు ఇప్పటికే ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొకుట్ల రూపేందర్ రెడ్డి పేర్కొన్నారు.డ్రైనేజీ సమస్యతో కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. డ్రైనేజీ పొంగి పొరుతున్న ప్రాంతంలో సాయిబాబా గుడి ఉన్న నేపథ్యంలో భక్తులకు వచ్చే వారు మురుగునీరులోనే ప్రయాణించాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా ఏఈ రోహిత్ ప్రత్యేక చొరవ తీసుకుని అశోక్ నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని రూపేందర్ రెడ్డి మరోసారి విజ్ఞప్తి చేశారు.

ఉప్పల్ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డికి దీపావళి శుభాకాంక్షలు

మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపిన శక్తి సాయినగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.వి. కృష్ణ కిట్టు



కాప్రా, పెన్ పవర్, నవంబర్ 10: ఈరోజు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డిని శక్తి సాయి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వి. కృష్ణ కిట్టు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎస్.వి. కృష్ణ కిట్టు మాట్లాడుతూ.. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ ప్రజలకు మరింత చేరువై, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

పవన్ విడాకులు.. అసలు చట్టం ఏం చెబుతోంది!



పవన్ కళ్యాణ్, అన్నా లెజ్నెవా విడాకుల వార్తల నేపథ్యంలో మ్యూచువల్ కన్సెంట్ డివోర్స్‌పై చర్చ జరుగుతోంది. భారత చట్టాల ప్రకారం విడిపోవాలని ప్రకటన చేసినంత మాత్రాన విడాకులు పూర్తికావు. కోర్టులో పిటిషన్ దాఖలు చేసి, నిర్దేశిత ప్రక్రియ పూర్తి చేసిన తర్వాతే విడాకులు మంజూరవుతాయి. పిల్లల కస్టడీ, భరణం, ఆస్తుల అంశాలను కూడా కోర్టు పరిశీలిస్తుంది.

పవన్ కళ్యాణ్, అన్నా లెజ్నెవా 13 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు రిపోర్ట్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇద్దరూ పరస్పర అంగీకారంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. అయితే భార్యాభర్తలు ఇద్దరూ విడిపోవడానికి అంగీకరిస్తే వెంటనే విడాకులు వచ్చేస్తాయా, కోర్టులో ఎలాంటి ప్రక్రియ ఉంటుంది, పిల్లల బాధ్యతలు, భరణం వంటి విషయాలను ఎలా నిర్ణయిస్తారనేది అందరిలో కలుగుతున్న సందేహాలు.

ఇక భారత చట్టాల ప్రకారం భార్యాభర్తలు ఇద్దరూ అంగీకరించి విడాకులు తీసుకునే విధానాన్ని 'డివోర్స్ బై మ్యూచువల్ కన్సెంట్' అంటారు. ఇందుకోసం ఇద్దరూ కలిసి కోర్టులో పిటిషన్ దాఖలు చేయవచ్చు. అయితే కేవలం విడిపోతున్నట్లు ప్రకటన ఇచ్చినంత మాత్రాన చట్టపరంగా వివాహ బంధం ముగిసినట్లు కాదు. కోర్టు విడాకుల ఉత్తర్వులు ఇచ్చిన తర్వాతే ఆ ప్రక్రియ పూర్తవుతుంది. స్పెషల్ మ్యారేజ్ యాక్ట్‌లోని సెక్షన్ 28 ప్రకారం పరస్పర అంగీకారంతో విడాకులు కోరుకునే దంపతులు కనీసం ఏడాది పాటు విడిగా జీవించి ఉండాలి. ఒకే ఇంట్లో ఉన్నా భార్యాభర్తలుగా కలిసి జీవించకపోతే కొన్ని సందర్భాల్లో దానిని విడిగా ఉన్నట్లుగానే పరిగణిస్తారు. అయితే ఆ పరిస్థితులను కోర్టు పరిశీలిస్తుంది. నార్మల్ గా పిటిషన్ దాఖలు చేసిన ఆరు నెలల తర్వాత ఇద్దరూ మరోసారి తమ అంగీకారాన్ని కోర్టుకు తెలియజేయాలి. దీనిని సెకండ్ మోషన్ అంటారు.

దంపతులు తమ నిర్ణయాన్ని మరోసారి ఆలోచించుకోవడానికి ఈ గడువు ఉంటుంది. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఆరు నెలల గడువును మినహాయించే అవకాశం కూడా ఉంది. ఇద్దరి మధ్య సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం లేదని కోర్టు భావిస్తే, వర్తించే చట్టం ప్రకారం నిర్ణయం తీసుకోవచ్చు. ఇక భరణం, పిల్లల కస్టడీ, ఆస్తుల వ్యవహారాలను కూడా విడాకుల సమయంలో పరిష్కరించుకుంటారు.

భార్యాభర్తలు వీటిపై ముందుగానే అంగీకారానికి రావచ్చు. పిల్లల విషయంలో వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తారు. తల్లిదండ్రులు చేసుకున్న ఒప్పందాన్ని కూడా కోర్టు పరిశీలించవచ్చు. పవన్, అన్నా వేర్వేరు మతాలకు చెందినవారు కావడంతో స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ ప్రస్తావన వస్తోంది. అయితే వారి వివాహం ఏ చట్టం కింద నమోదైందనే దానిపైనే విడాకులకు వర్తించే నిబంధనలు ఆధారపడి ఉంటాయి. ఇక ఇద్దరూ పిల్లల బాధ్యతలను కలిసి చూసుకుంటామని ప్రకటనలో ఉంది. ఇక నెక్స్ట్ ఈ విషయంలో ఈ ఇద్దరి నుంచి మరో క్లారిటీ ఏమైనా వస్తుందేమో చూడాలి.

ఆ వార్తలు ఓవైపు.. ప్రజా నాయకుడిగా పవన్ ఇలా!



భార్య అన్నా కొణిదెలతో పవన్ కళ్యాణ్ విడిపోతున్నారంటూ వస్తున్న వార్తలపై చర్చ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనూ పవన్ తన ప్రభుత్వ బాధ్యతలను కొనసాగిస్తున్నారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశానికి హాజరయ్యారు. అయితే వ్యక్తిగత జీవితంపై వస్తున్న వార్తలకు పవన్ స్పందిస్తే స్పష్టత వస్తుందని అభిమానులు భావిస్తున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించి కొన్ని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. భార్య అన్నా కొణిదెలతో విడిపోతున్నారంటూ మీడియాలో రిపోర్ట్స్ రావడం హాట్ టాపిక్‌గా మారింది. ఈ వార్తలపై రకరకాల అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే ఇలాంటి సమయంలోనూ పవన్ తన ప్రభుత్వ కార్యక్రమాలతో బిజీగా ఉండటం హైలెట్ అవుతోంది. వ్యక్తిగతంగా ఏం జరుగుతున్నా డిప్యూటీ సీఎంగా తన పనులను కొనసాగిస్తున్నారు.మంగళవారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశానికి పవన్ హాజరయ్యారు. ఇతర మంత్రులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. చంద్రబాబుతో కలిసి నడుస్తున్న ఫొటోలతో పాటు కేబినెట్ సమావేశంలో ఉన్న ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోల్లో పవన్ ఎప్పటిలాగే కనిపించారు.నిజానికి పవన్ వ్యక్తిగత జీవితం గురించి గతంలోనూ చాలాసార్లు వార్తలు వచ్చాయి. రాజకీయంగా ప్రత్యర్థులు కూడా ఆయన పెళ్లిళ్ల అంశాన్ని ప్రస్తావిస్తూ విమర్శలు చేసిన సందర్భాలున్నాయి. ఇప్పుడు మరోసారి అలాంటి వార్తలు వస్తున్నా పవన్ మాత్రం వాటిపై ఎలాంటి స్పందన ఇవ్వకుండా తన పనుల్లో ఉన్నారు.ఇక్కడ రాజకీయాలు వేరు, వ్యక్తిగత జీవితం వేరు అనే కోణం కూడా ఉంది. ఒక వ్యక్తి కుటుంబానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం ఒక అంశమైతే, ప్రజలు ఎన్నుకున్న నాయకుడిగా బాధ్యతలు నిర్వర్తించడం మరో అంశం. వ్యక్తిగత విషయాలపై ఎవరి అభిప్రాయాలు వారికి ఉండొచ్చు. కానీ ప్రభుత్వంలో పవన్ ఏం చేస్తున్నారు, తన శాఖలకు ఎంత సమయం కేటాయిస్తున్నారు, ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారనేది ముఖ్యం.మరోవైపు ప్రస్తుతం వస్తున్న వార్తలపై పవన్ నుంచి క్లారిటీ వస్తే బాగుంటుందని జనసేన అభిమానులు నుంచి కూడా కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశమే అయినప్పటికీ, రాజకీయంగా కీలక స్థానంలో ఉండటంతో ఈ వ్యవహారంపై ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో వస్తున్న రకరకాల కథనాలకు పవన్ స్వయంగా స్పందిస్తే స్పష్టత వస్తుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.పవన్ కళ్యాణ్‌కు జీవితంలో ఇలాంటి పరిస్థితులు కొత్తేమీ కాదు. సినీ కెరీర్‌లో విమర్శలు, పరాజయాలు, భారీ విజయాలు చూశారు. రాజకీయాల్లోనూ ఓటమి నుంచి డిప్యూటీ సీఎం స్థాయికి చేరుకున్నారు. ఎన్నో సందర్భాల్లో తనపై వచ్చిన విమర్శలకు నేరుగా సమాధానమిచ్చారు. ఇప్పుడు వ్యక్తిగత జీవితంపై వస్తున్న వార్తల విషయంలోనూ సరైన సమయంలో స్పందిస్తారని అభిమానులు ఆశిస్తున్నారు. మరి పవన్ ఈ అంశంపై క్లారిటీ ఇస్తారా, లేక వ్యక్తిగత వ్యవహారంగా భావించి స్పందించకుండా ఉంటారా అనేది చూడాలి.

పవన్ కోసం.. టీడీపీ, వైసీపీ ఒకే మాట!



పవన్ కళ్యాణ్, అన్నా కొణిదెల విడిపోతున్నారనే వార్తల నేపథ్యంలో టీడీపీ, వైసీపీ ఆసక్తికర నిర్ణయం తీసుకున్నాయి. నేతలు, కార్యకర్తలు రాజకీయ నాయకుల వ్యక్తిగత జీవితాలపై కామెంట్స్ చేయొద్దని రెండు పార్టీలు సూచించాయి. అభ్యంతరకర పోస్టులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐటీడీపీ హెచ్చరించగా, వ్యక్తుల ప్రైవసీని గౌరవించాలని వైసీపీ కోరింది. ఏపీ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకే అభిప్రాయంతో ఉండటం చాలా అరుదు. ముఖ్యంగా టీడీపీ, వైసీపీ మధ్య రాజకీయ విమర్శలు ఏ స్థాయిలో ఉంటాయో తెలిసిందే. అలాంటిది ఇప్పుడు పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తల విషయంలో రెండు పార్టీల నుంచి దాదాపు ఒకే తరహా ప్రకటనలు రావడం ఆసక్తికరంగా మారింది. వ్యక్తిగత విషయాలపై కామెంట్స్ చేయొద్దంటూ తమ పార్టీ శ్రేణులకు సూచనలు జారీ చేశాయి.

పవన్ కళ్యాణ్, అన్నా కొణిదెల విడిపోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో రకరకాల పోస్టులు కనిపిస్తున్నాయి. గతంలో పవన్ పెళ్లిళ్లపై రాజకీయ ప్రత్యర్థులు పలుమార్లు విమర్శలు చేశారు. ముఖ్యంగా వైసీపీ నేతలు ఎన్నికల సమయంలో ఈ అంశాన్ని ప్రస్తావించిన సందర్భాలున్నాయి. అయితే ఇప్పుడు అదే పార్టీ వ్యక్తిగత వ్యవహారాలపై ఎవరూ కామెంట్స్ చేయొద్దని చెప్పడం విశేషం. వైసీపీ తన నాయకులు, అధికార ప్రతినిధులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులకు నాలుగు సూచనలు చేసింది. రాజకీయ నాయకుల వ్యక్తిగత విషయాలపై బహిరంగంగా వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొంది. అలాంటి పోస్టులపై స్పందించవద్దని, వాటిని షేర్ చేయవద్దని సూచించింది. సంబంధిత వ్యక్తుల ప్రైవసీని గౌరవించాలని కోరింది.మరోవైపు ఐటీడీపీ కూడా ఇదే అంశంపై ప్రకటన ఇచ్చింది. అయితే ఇందులో మరో ఆసక్తికరమైన పాయింట్ ఉంది. కేవలం కూటమి పార్టీల నేతలే కాకుండా వైసీపీ నాయకుల వ్యక్తిగత జీవితాలపై కూడా కామెంట్స్ చేయొద్దని స్పష్టం చేసింది. ఐటీడీపీకి సంబంధించిన సోషల్ మీడియా ఖాతాల నుంచి అలాంటి వ్యాఖ్యలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. వ్యక్తులు చేసే అభ్యంతరకరమైన కామెంట్స్‌తో తమకు సంబంధం లేదని పేర్కొంది.నిజానికి గత కొన్నేళ్లుగా టీడీపీ, వైసీపీ మధ్య వ్యక్తిగత విమర్శలు కూడా ఎక్కువగానే కనిపించాయి. పవన్ పెళ్లిళ్ల అంశంతో పాటు చంద్రబాబు కుటుంబం, జగన్ వ్యక్తిగత వ్యవహారాలను కూడా రాజకీయ విమర్శల్లో ప్రస్తావించిన సందర్భాలున్నాయి. సోషల్ మీడియాలో రెండు పార్టీల మద్దతుదారుల మధ్య ఇలాంటి పోస్టులు తరచూ కనిపిస్తుంటాయి. అలాంటి పరిస్థితుల్లో రెండు వైపుల నుంచి ఒకేసారి ఈ తరహా ప్రకటనలు రావడం హైలెట్ అవుతోంది.అయితే ఈ ప్రకటనలు ఎంతవరకు అమలవుతాయనేది మరో అంశం. ఐటీడీపీ నేరుగా క్రమశిక్షణ చర్యల గురించి హెచ్చరించగా, వైసీపీ మాత్రం తమ శ్రేణులకు సూచనలు ఇచ్చింది. ఇప్పటికే సోషల్ మీడియాలో వ్యక్తిగత విమర్శలు చేసినవారిపై చర్యలు తీసుకున్నట్లు ఈ ప్రకటనల్లో పేర్కొనలేదు. ఇక పవన్ వ్యక్తిగత జీవితంపై వస్తున్న రిపోర్ట్స్ విషయంలో జనసేన నుంచి నేరుగా ఎలాంటి వివరణ రాలేదు. ఇక పవన్ కూడా ఈ విషయంలో ఎలాంటి క్లారిటీ ఇస్తారా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు.

రాప్తాడు బాలిక ఆరోగ్యంలో కీలక మార్పు.. ప్రాణాపాయం దాటినట్లే!



రాప్తాడులో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన పదో తరగతి విద్యార్థిని ఆరోగ్యం మెరుగుపడుతోంది. బెంగళూరు మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను వైద్యులు ప్రత్యేక వార్డు నుంచి సాధారణ వార్డుకు మార్చారు. ఎడమ చేతి పట్టీ తొలగించడంతో కదిలించగలుగుతోంది. మరోవైపు, పోలీసుల కాల్పుల్లో కుడికాలు కోల్పోయిన నిందితుడు హేమంత్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రాప్తాడులో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన పదో తరగతి విద్యార్థిని ఆరోగ్యం క్రమంగా మెరుగు పడుతోంది. గత నెల 31న బాలికపై ఉన్మాది దాడి చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి బెంగళూరు మణిపాల్ ఆస్పత్రిలో బాలిక చికిత్స పొందుతోంది. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో చిన్నారికి వైద్యులు చికిత్స చేస్తున్నారు. ప్రతి రోజూ ఆమె ఆరోగ్య విషయమై మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్ యాదవ్ తెలుసుకుంటున్నారు. మంత్రి లోకేశ్ ప్రతిరోజు చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై ఎక్స్ వేదికగా ప్రకటన చేస్తున్నారు. మంగళవారం చిన్నారి ఆరోగ్యం కుదుటపడిందని ప్రత్యేక వార్డు నుంచి సాధారణ వార్డుకు తరలించినట్లు ఇద్దరు మంత్రులు తెలిపారు.ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన బాలికకు తల, మెడ, ముఖం, చేతులు, వీపుపై గాయాలు అయ్యాయి. వీటికి సోమవారం కట్లు మార్చారు. చికిత్సను తట్టుకున్న బాలిక వేగంగా కోలుకుంటోందని వైద్యులు స్పష్టం చేశారు. ఆమె ఎడమ చేతికి పట్టీ తొలగించారు. దీంతో చేతిని కదిలించుకునేందుకు వీలు కలిగిందని చెబుతున్నారు. దగ్గినప్పుడు ఛాతీలో నొప్పి వస్తోందని బాలిక చెబుతోందని దీనికి చికిత్స అందిస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇక నోటి ద్వారా ఆహారం తక్కువగా తీసుకుంటుండటం వల్ల ముక్కు ద్వారా గొట్టంతో ఆహారం అందజేస్తున్నారు.బాలిక మరింత వేగంగా కోలుకోడానికి నోటి ద్వారా ఆహారం తీసుకునేలా వైద్యులు ప్రోత్సహిస్తున్నారు. మణి పాల్ ఆస్పత్రి డాక్టర్ భాస్కర్ షెనాయ్ పర్యవేక్షణలో ప్లాస్టిక్ సర్జరీ, ఆర్థోపెడిక్ వైద్యుల సమన్వయంతో బాలికకు చికిత్స చేయిస్తున్నారు. ఉన్మాది దాడిలో గాయపడిన బాలిక ప్రాణాపాయం నుంచి బయటపడటంపై అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సత్వర వైద్యం అందడంతో బాలిక వేగంగా కోలుకుంటోందని చెబుతున్నారు. మరోవైపు చిన్నారిపై దాడి చేసిన నిందితుడు హేమంత్ కుంటివాడు అయ్యాడు.నిందితుడు కూడా ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. దాడి అనంతరం పరారైన నిందితుడిని పట్టుకునే క్రమంలో పోలీసులు ఎన్ కౌంటర్ చేశారు. ఈ సమయంలో పోలీసు తూటాలు నిందితుడి కాళ్లలో నరాలను చిద్రం చేశాయి. దీంతో అతడి కుడికాలిని తొడ భాగం నుంచి తొలగించారు. శస్త్రచికిత్స అనంతరం నిందితుడు కోలుకునేందుకు కొంత సమయం పడుతుందని చెబుతున్నారు. పూర్తిగా కోలుకున్నాక అతడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచి జైలుకు తరలిస్తామని పోలీసులు తెలిపారు.

అనంతపురం వైసీపీ మేయర్.. కూటమి పక్కా ప్లానింగ్, ఆ ఒక్కరినీ లాగేస్తారా?!



అనంతపురం మేయర్ రమేశ్ గౌడ్‌ను టీడీపీలోకి రావాలని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఆహ్వానించడం చర్చనీయాంశమైంది. మేయర్ ప్రమాణ స్వీకారం చేయకముందే ఈ ప్రతిపాదన రావడంతో వైసీపీ అప్రమత్తమైంది. మేయర్ స్థానాన్ని కూటమి లక్ష్యంగా చేసుకుందా అన్న ఊహాగానాలు మొదలయ్యాయి.

అనంతపురం జిల్లా రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ప్రధానంగా ప్రతిపక్షం వైసీపీ గెల్చుకున్న అనంత మేయర్ స్థానంపై అధికార కూటమి గురిపెట్టిందనే టాక్ నడుస్తోంది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి మధ్య మాటల యుద్ధం గమనిస్తే జిల్లా రాజకీయాల్లో ఏదో జరగబోతోందన్న సంకేతాలు అందుతున్నాయని పరిశీలకులు అనుమానిస్తున్నారు. అనంతపురం మేయర్ స్థానాన్ని వైసీపీ గెలుచుకుంది.

ఈ నేపథ్యంలో జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉందని, ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వెళితే ఒక్కరు తిరిగి గెలిచే అవకాశం లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి వ్యాఖ్యానించారు. అంతేకాకుండా టీడీపీ ఎమ్మెల్యేలు తిరిగి గెలిస్తే తాను రాజకీయాల నుంచి విరమించుకుంటానని సవాల్ చేశారు. దీనిపై టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి సీరియస్ గా స్పందించారు. అంతే కాకుండా వైసీపీ మేయర్ రమేశ్ గౌడ్ వెంటనే టీడీపీలోకి రావాలని లేదంటే ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొవాల్సివస్తుందో చెబుతూ హాట్ కామెంట్స్ చేశారు. దీంతో అనంత మేయర్ పై అధికార పార్టీ గురిపెట్టిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో 13 కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగితే, అనంతపురంలో మాత్రమే వైసీపీ గెలిచింది. మిగిలిన 12 కార్పొరేషన్లను టీడీపీ కూటమి దక్కించుకుంది. అనంతపురం మేయర్ సీటును పొత్తుల్లో భాగంగా బీజేపీకి కేటాయించడం, ఆ పార్టీకి సంస్థాగతంగా బలం లేకపోవడం, ఓటు బదిలీ కాకపోవడం వంటి కారణాలతో కూటమి అభ్యర్థి ఓడిపోయినట్లుగా విశ్లేషిస్తున్నారు. అయితే వైసీపీ గెలవడం జిల్లాలోని కూటమి నేతలకు తలకొట్టేసినట్లుగా ఉందని చెబుతున్నారు. దీంతో వైసీపీ నుంచి గెలిచిన మేయర్ రమేశ్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేయకముందే పార్టీలోకి లాగేయాలని టీడీపీ కూటమి నేతలు ప్లాన్ చేస్తున్నట్లు అనుమానిస్తున్నారు. దీనికి మాజీ ఎమ్మెల్యే జేసి ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉదహరిస్తున్నారు.

అగ్గిరాజేసిన జేసీ

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి వ్యాఖ్యలపై స్పందిస్తూ జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడిన మాటలు సంచలన రాజకీయ చర్చకు తెరతీసింది. తమ ఎమ్మెల్యేలను రాజీనామా చేయాలని అనంత వెంకటరామిరెడ్డి సవాల్ చేయడాన్ని తప్పుబట్టిన ప్రభాకర్ రెడ్డి వైసీపీ నుంచి గెలిచిన మేయర్ వెంటనే తమతో చేతులు కలపాలని ఆహ్వానం పలుకుతూ విపక్షాన్ని ఉలికిపాటుకు గురిచేశారని చెబుతున్నారు. వైసీపీ తరపున గెలిచిన మేయర్ ఒంటరిగా ఏం చేయలేరని, కార్పొరేషన్లలో ఎక్కువ కార్పొరేటర్లను గెలుచుకున్న కూటమికే బలం ఎక్కువగా ఉందని జేసీ తెలిపారు. కార్పొరేటర్ల మద్దతు లేకుండా మేయర్ ఏం చేయలేరని, అధికార పార్టీలోకి వస్తే నగరాభివృద్ధి జరుగుతుందని జేసీ వ్యాఖ్యానించారు. అంతేకాకుండా గత ప్రభుత్వంలో తాను తాడిపత్రి మున్సిపల్ చైర్మనుగా గెలిస్తే ప్రభుత్వం నుంచి సహాయ నిరాకరణ ఎదురైందని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే మేయర్ రమేశ్ గౌడ్ టీడీపీలో చేరాలని సలహా ఇచ్చారు.

అయితే జేసీ చేసిన సూచన రాజకీయంగా హీట్ పుట్టిస్తోంది. వైసీపీ నుంచి గెలిచిన మేయర్ ను పార్టీలోకి రమ్మంటూ జేసీ పిలుపునివ్వడం వెనుక ఏమైనా రాజకీయ వ్యూహం ఉందా? అన్న చర్చ జరుగుతోంది. పార్టీ అధిష్టానం ప్రోద్బలంతో జేసీ ఈ వ్యాఖ్యలు చేశారా? లేక స్వతహాగా తన అనుభవంతోనే ఇలాంటి ప్రతిపాదన తెరపైకి తీసుకువచ్చారా? అన్నది తేలాల్సివుందని అంటున్నారు. ఏదిఏమైనా ప్రమాణ స్వీకారం చేయకముందే మేయర్ ను తమ పార్టీలోకి రమ్మంటూ జేసీ ప్రభాకర్ రెడ్డి పిలుపునివ్వడం తీవ్ర రాజకీయం చర్చగా మారింది. దీనిపై వైసీపీ స్పందన ఎలా ఉంటుందో చూడాల్సివుందని అంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

10 రోజుల ఉత్కంఠ.. 19న జడ్పీ, మండల పరిషత్ చైర్మన్ల ఎన్నిక



ఏపీలో జడ్పీ, మండల పరిషత్ అధ్యక్షుల ఎన్నికకు ఎస్ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 19న జడ్పీ చైర్మన్లు, ఎంపీపీలు, ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆదేశించారు. ఆరోజు సాధ్యం కాకపోతే 20న నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని 28 జడ్పీల్లో 27 కూటమికి, ఒకటి వైసీపీకి దక్కే అవకాశం ఉండటంతో పదవుల కోసం పోటీ నెలకొంది.జడ్పీ, మండల పరిషత్ అధ్యక్షుల ఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 19న జడ్పీ, మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహించాలని సూచిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఉత్తర్వులు జారీ చేశారు. 19న ఎన్నిక జరగకుంటే ఆ మరునాడు 20వ తేదీన ఎన్నిక నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు 10వ తేదీ (మంగళవారం) షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 5న జరిగిన ఎన్నికల్లో గెలిచిన ఎంపీటీసీలు ఎంపీపీలను, జడ్పీటీసీ అభ్యర్థులు జడ్పీ చైర్మన్లను ఎన్నుకుంటారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఫలితాలు ఈ నెల 7న విడుదలైన విషయం తెలిసిందే. మూడు రోజులుగా జడ్పీ చైర్మన్, మండల అధ్యక్షుల ఎవరు అవుతారనే చర్చ ఎక్కడిక్కడ జరుగుతోంది. ఇప్పుడు మరో పది రోజుల సమయం ఉండటంతో ఆశావహుల సంఖ్య పెరగడంతోపాటు అధిష్టానానికి తలనొప్పులు తప్పవని అభిప్రాయపడుతున్నారు.ఈ నెల 19న జడ్పీ చైర్మన్, మండల పరిషత్ అధ్యక్షులను ఎన్నుకోవడంతోపాటు అదే రోజు ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. 19న తప్పితే 20న ఎన్నిక నిర్వహించాల్సివుంటుంది. అదేవిధంగా మండల పరిషత్ లో ఒకరు, జిల్లా పరిషత్తులో ఇద్దరు చొప్పున కో-ఆప్షన్ సభ్యులను ఎన్నుకోవాలని ఎస్ఈసీ స్పష్టం చేసింది. మతం, భాషాపరమైన మైనార్టీలకు కో-ఆప్షన్ సభ్యులుగా ఎంపిక చేయాలని సూచించింది. సహజంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ముగిసిన రెండు మూడు రోజులకే మండలాధ్యక్షులు, జడ్పీ చైర్మన్లను ఎన్నుకుంటారు. అయితే ఈ సారి దాదాపు రెండు వారాల సమయం ఇస్తూ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం చర్చనీయాంశం అవుతోంది.ఇప్పటికే ఫలితాలు వచ్చి మూడు రోజులు అవుతుండగా, మరో పది రోజుల సమయం ఇవ్వడం వల్ల రాష్ట్ర రాజకీయాలు వాడివేడిగా కొనసాగే అవకాశం ఉందని అంటున్నారు. రాష్ట్రంలో మొత్తం 28 జడ్పీలు ఉండగా, 27 జడ్పీలు కూటమికి దక్కే అవకాశం ఉంది. అల్లూరి జిల్లా పీఠం మాత్రం వైసీపీకి దక్కనుంది. ఈ పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందని అంటున్నారు. దీంతో ఎవరిని ఎంపిక చేయాలనే విషయమై ఆయా పార్టీల అగ్రనాయకత్వాలు తర్జనభర్జన పడుతున్నాయి. ఎస్ఈసీ నిర్ణయం వల్ల పది రోజుల సమయం ఉండటంతో అన్నిరకాలుగా ఆలోచించిన తర్వాతే అభ్యర్థులపై ప్రకటన ఉంటుందని చెబుతున్నారు.

బరిలో బడా నేతలు

ఎంపీటీసీలుగా గెలిచిన వారిలో ఒకరిని మండలాధ్యక్షులుగా, జడ్పీటీసీల్లో గెలిచిన వారిలో ఒకరిని జడ్పీ చైర్మనుగా ఎన్నుకుంటారు. పరోక్ష విధానంలో జరిగే ఈ ఎన్నికపై రాజకీయంగా ఉత్కంఠ నెలకొంది. 27 జిల్లాల్లో కూటమికి స్పష్టమైన ఆధిక్యం ఉండటంతో చైర్మన్లు, మండలాధ్యక్షుల ఎన్నిక లాంఛనంగానే చెబుతున్నారు. అయితే కొన్నిచోట్ల రెండు పార్టీలకు సమానంగా ఎంపీటీసీ స్థానాలు రావడం, తేడా తక్కువగా ఉండటం వల్ల ఆయా స్థానాల కోసం భారీ స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధికార, ప్రతిపక్షాలు ఆయా స్థానాలను సొంతం చేసుకోడానికి వ్యూహాలు రచిస్తున్నాయి. దీంతో ఆయా మండలాల్లో రాజకీయం రసవత్తరంగా మారింది. ఇలా రాష్ట్రంలో సుమారు 30 మండలాల వరకు ఇరు పార్టీల మధ్య పోటీ ఉందని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో పది రోజుల సమయం దొరకడం అధికార పార్టీకి కలిసివచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

పవన్ విడాకుల వేళ.. రేణు హుందాతనం



అవును. విడాకుల వార్తను ధ్రువీకరించినట్లుగా రాయకుండా, సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వార్తగా పేర్కొనాలి. రేణు దేశాయ్ స్పందనగా వైరల్ అవుతున్న పోస్టును కూడా ఆమెకు ఆపాదిస్తూ, నిర్ధారణ లేని విషయాలను వాస్తవాలుగా చూపకుండా హెడ్‌లైన్స్ రూపొందిస్తాను.నిన్న లేట్ నైట్ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విడాకుల వార్త బయటికి వచ్చినప్పటి నుంచి సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఇదే హాట్ టాపిక్. తన మూడో భార్య అనా కొణిదెలతో పదమూడేళ్ళ వివాహ బంధానికి పవన్ తెర దించడం ఆయన అభిమానులకు, జనసేన కార్యకర్తలకు ఏమాత్రం మింగుడుపడడం లేదు. కొన్నేళ్ల ముందు అనా తిరుమలకు కాలి నడకన వెళ్ళి తలనీలాలు సమర్పించుకోవడం, కొన్ని నెలల ముందు తన ఇంటిపేరును కొణిదెలగా మార్చుకోవడం లాంటి పరిణామాలతో ఈ బంధం శాశ్వతం అనుకున్నారంతా. కానీ ఇప్పుడు ఊహించనిది జరిగింది.ఈ సమయంలో పవన్ మాజీ భార్య రేణు దేశాయ్ ఎలా స్పందిస్తుందా అని అందరూ ఎదురు చూస్తున్నారు. తనకు విడాకులు ఇచ్చి పవన్ మరో వివాహం చేసుకోవడంపై గతంలో రేణు నెగెటివ్ కామెంట్స్ చేసిన నేపథ్యంలో ఇప్పుడు అలాంటి వ్యాఖ్యలేమైనా చేస్తుందా అని కూడా కొంతమంది అనుకుంటున్నారు. కానీ రేణు చాలా హుందాగా ఒక పోస్టు పెట్టి ప్రశంసలు అందుకొంది.“ఒక వ్యక్తి కష్టంలో ఉంటే వాళ్లని ఇంకా దూషించడం నైతికంగా కరెక్ట్ కాదు. ఆల్రెడీ కింద పడిపోయిన వాళ్లను తొక్కడం అమానవత్వం. వాళ్లు ఏ స్థాయిలో ఉన్నా, వాళ్లు కూడా ఒక మనిషి. ఒకరి సంతానం, ఒక పేరెంట్ లేదా ఒకరి తోడబుట్టిన వాళ్లు అని మరిచిపోకూడదు. మనం సవ్యంగా లేని అద్దాల మేడల్లో ఉంటూ ఇంకొకరి ఇళ్ల మీదికి రాళ్లు వేయకూడదు. మనందరం మనుషులమే. ఇతరుల మీద కొంచెం దయ, ఆపేక్ష చూపించడం మనిషిగా మన ప్రాథమిక కర్తవ్యం. నేను ఇలా మాట్లాడాను కాబట్టి మళ్లీ పిచ్చి ఊహాగానాలు చేయకండి.నేను సమాజం బ్లగుండాలని ఆశించే మనిషిని. నేనిలా దయతో మాట్లాడడానికి నాకేమీ ఎవ్వరూ పేటీఎం ఇవ్వలేదు. నా పద్ధతి ఇలా ఉంటుందంతే” అని తన ఇన్స్టా అకౌంట్లో రేణు పోస్ట్ చేసింది. ఇదే అదను అనుకొని పవన్ విడాకుల వ్యవహారం మీద నెగెటివ్ గా స్పందించకుండా రేణు పెట్టిన ఈ పోస్టుపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

వైసీపీ ఓటమికి ఇవే ప్రధాన కారణాలట.. జాగ్రత్తపడకపోతే అంతే



వైసీపీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు దక్కలేదు. అది ఊహించింది అయినా సరైన ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లకపోవడం, నియోజకవర్గాల ఇన్ ఛార్జుల్లో అలసత్వం వంటివి కొన్ని చోట్ల ప్రధాన కారణాలుగా చెప్పాలి. వైసీపీ అనంతపురం మేయర్ స్థానం గెలిచిందంటే అక్కడ వైసీపీ స్థానిక నాయకత్వం బలంగా పనిచేసింది. నందికొట్కూరులోనూ అంతే. అలా మిగిలిన చోట్ల ఓటమి పాలు కావడానికి అనేక కారణాలున్నాయి. తమను అధికార పార్టీ నామినేషన్లు వేయకుండా అడ్డుకుందని, పోలింగ్ కు ఓటర్లను రానివ్వకుండా అడ్డుకున్నారని కుంటిసాకులు చెప్పుకోవచ్చు. కానీ కడప, అనంతపురం, చిత్తూరు, పల్నాడు జిల్లాల వంటి వాటి చోటే ఆ ఘటనలు జరిగాయి. మిగిలిన రాష్ట్రంలో ప్రశాంతంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అక్కడి ఫలితాలపై వైసీపీ ఆత్మశోధన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నివేదికలో పేర్కొన్న అంశాలివే...

జగన్‌కు కు ఇప్పటికే ఓటమికి గల కారణాపై నివేదికలు అందినట్లు తెలిసింది. వైసీపీ ఓటమికి ప్రధాన కారణాలు కూడా ఈ నివేదికలో పొందుపర్చినట్లు తెలిసింది. వంద మందికి పైగా నియోజకవర్గ ఇన్‌చార్జిల నిర్లక్ష్యంగా ఉన్నారని నివేదికలో స్పష్టం చేశారని తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలను తేలిగ్గా తీసుకోవడంతో పాటు ప్రచారం విషయంలోనూ వెనుకంజలో పడటం వల్లనే కొన్ని చోట్ల ఓటమి పాలయ్యారని రిపోర్టులో పేర్కొన్నారు. అధికార పార్టీతో రహస్య సంప్రదింపులుకూడా జరిపినట్లు జగన్ అందిన నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ఆళ్లగడ్డ వంటి చోట కూడా టీడీపీ, వైసీపీలు స్థానాలను పంచుకోవడాన్ని ఈ సందర్భంగా కొందరు ప్రస్తావిస్తున్నారు. ఆళ్లగడ్డ బయటకు వచ్చిన అంశం. అనేక చోట్ల ఇలా రహస్య ఒప్పందం జరిగిందని నివేదికలో పేర్కొన్నారని తెలిసింది.

అసలు కారణాలివే...

ప్రచారంలో అధికార పార్టీ కంటే వెనకబడి ఉండటం కూడా ప్రధాన కారణమని నివేదికలో పేర్కొనట్లు సమాచారం. అభ్యర్థులకు అండదండగా నిలబడక పోవడం కూడా ఓటమికి ముఖ్య కారణం. పోటీలో నిలిచిన అభ్యర్థులకు అవసరమైన మద్దతు, ధైర్యం కల్పించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సెల్ఫీ వీడియోలు, హౌస్ అరెస్టుల ప్రచారానికే పరిమితం అయితే ప్రజలు తమకు అండగా నిలుస్తారన్న గుడ్డి నమ్మకమే ఓటమికి మూల కారణంగా నివేదికలో చూపారు. నియోజకవర్గ ఇన్‌చార్జిలు స్వయంగా పోరాటం చేయకుండా కార్యకర్తలతోనే ధర్నాలు చేయించడం. నియోజకవర్గ ఇన్‌చార్జిల పనితీరును సమీక్షించి అవసరమైన మార్పులు చేయకపోతే, 2029 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి భారీ రాజకీయ నష్టం తప్పదని ఆ నివేదికలో హెచ్చరించినట్లు కూడా తెలుస్తోంది. జగన్ ఈ నివేదికపై త్వరలో పార్టీ ఇన్ ఛార్జులతో సమావేశం అయి క్లాస్ పీకే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎమ్మెల్యేలతో సీఎం విజయ్ అత్యవసర భేటీ.. తమిళనాడులో ఏం జరగబోతోంది?



తమిళనాడులో ఇద్దరు టీవీకే ఎమ్మెల్యేలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సీఎం విజయ్ బుధవారం పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం కానున్నారు. డిప్యూటీ స్పీకర్ రవిశంకర్ ఓ ఫొటోగ్రాఫర్‌పై దాడి చేశారనే ఆరోపణలు, ఎమ్మెల్యే అరుళ్ విఘ్నేశ్ మహిళా కలెక్టర్‌కు అసభ్య సందేశాలు పంపారనే వార్తలు వివాదానికి దారితీశాయి. ఈ నేపథ్యంలో వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయా అనే ఆసక్తి నెలకొంది.

తమిళనాడులో అధికార టీవీకే ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి దళపతి విజయ్ సమావేశం కానున్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుందని చెబుతున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ అత్యంత సాధారణంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ, ఆయన పార్టీలోని ఎమ్మెల్యేలు మాత్రం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వారి వ్యవహారశైలి కారణంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని చెబుతున్నారు. తాజాగా డిప్యూటీ స్పీకర్ రవిశంకర్, ఎమ్మెల్యే అరుళ్ విఘ్నేశ్ ఒక మహిళా కలెక్టర్ కు అసభ్య సందేశాలు పంపారని కథనాలు ప్రసారం అయ్యాయి. దీంతో ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారని అంటున్నారు.

ఇద్దరు ఎమ్మెల్యేలపై ఒకేసారి ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఆత్మరక్షణలోకి వెళ్లిపోయింది. ఆ ఆరోపణలు తిప్పికొట్టడంలోనూ పార్టీ యంత్రాంగం విఫలమైందని సీఎం భావిస్తున్నారని అంటున్నారు. డిప్యూటీ స్పీకర్ రవిశంకర్ తన నియోజకవర్గంలోని తాగునీటి సమస్య చెప్పిన ఒక ఫొటో గ్రాఫర్ పై దాడి చేశారు. తాను విజయ్ అభిమానిని అంటూ బాధితుడు చెబుతున్నప్పటికీ డిప్యూటీ స్పీకర్ కనికరించలేదు. ప్రజాప్రతినిధిని అన్న విషయాన్ని మరచిపోయి పిడిగుద్దులు కురిపిస్తూ దాడికి దిగారని అంటున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి.

అదేవిధంగా ఎమ్మెల్యే అరుళ్ విఘ్నేశ్ కళ్లకురిచి జిల్లా కలెక్టర్ కి అసభ్య మెసేజ్ లు పంపారనే ఆరోపణలు తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్, మాజీ గవర్నర్ తమిళిసై తీవ్రంగా స్పందించారు. ఎమ్మెల్యే తీరును ప్రశ్నిస్తూ సోషల్ మీడియా ద్వారా విమర్శలు గుప్పించారు. అయితే తాను ఎలాంటి మెసేజ్లు పంపలేదని ఎమ్మెల్యే అరుళ్ విఘ్నేశ్ వివరణ ఇచ్చారు. అయినప్పటికీ ఈ వివాదం రాజకీయంగా పార్టీకి నష్టం చేసినదిగా సీఎం భావిస్తున్నారని చెబుతున్నారు. తమ ఎమ్మెల్యేలు అనవసర వివాదాల్లో చిక్కుకోవడం ద్వారా పార్టీకి ఇబ్బందులు వస్తున్నాయనే ఆలోచనతో అత్యవసరంగా సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు.

బుధవారం టీవీకే ప్రధాన కార్యాలయంలో జరిగే సమావేశంలో ముఖ్యమంత్రి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే ఉత్కంఠ నెలకొంది. తాను ఎంత క్రమశిక్షణతో నడుచుకుంటున్నా, ఎమ్మెల్యేలు మాత్రం వివాదాస్పదర వైఖరి కారణంగా ప్రభుత్వం ఇబ్బందుల్లో పడుతోందని సీఎం ఆగ్రహంగా ఉన్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఎమ్మెల్యేలపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. అయితే అత్తెసరు మెజార్టీతో ప్రభుత్వాన్ని నడుపుతున్న సీఎం విజయ్ ఎమ్మెల్యేలపై కఠిన వైఖరి ప్రదర్శించేందుకు సాహసిస్తారా? అనేది ఉత్కంఠకు గురిచేస్తోంది. మెజార్టీ కోసం ఇతర పార్టీలపై ఆధారపడిన సీఎం విజయ్ సొంత పార్టీ వారిపై వేటు వేసే అవకాశాలు లేవని, అలా అని ఉపేక్షిస్తే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో ఎమ్మెల్యేల అత్యవసర సమావేశంలో సీఎం విజయ్ తీసుకోబోయే నిర్ణయాలు సస్పెన్స్ గా మారాయి.

ఒక ఎఫైర్ ఖరీదు అక్షరాల రూ.18 లక్షల కోట్ల నష్టం..



సంబంధాలున్నాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ ఆరోపణలు అమెరికా-చైనా టెక్ వార్ నేపథ్యంలో భద్రతాపరమైన ఆందోళనలకు దారితీసినట్లు కథనం పేర్కొంది. ఈ వివాదంతో ఇన్వెస్టర్లలో కలవరం, రూ.18 లక్షల కోట్ల సంపద నష్టం జరిగిందనే ప్రచారం సాగుతోంది. అయితే ఈ ఆరోపణలకు విశ్వసనీయమైన ఆధారాలు, మార్కెట్ నష్టానికి సంబంధించిన ధ్రువీకరణ అవసరం.

ఎంత పెద్ద శక్తివంతుడైనా.. ఓ 'కాంత' దానుడేనని ఊరికే అనలేదు పెద్దలు.. టెక్నాలజీలో తోపు అయిన ఎన్వీడియా సీఈవో అమ్మాయి పలకరించేసరికి ఫ్లాట్ అయిపోయి బెండ్ అయిపోయాడు. ఇప్పుడు తన ఇన్నాళ్లు సంపాదించుకున్న పరువు ప్రతిష్ట సహా మొత్తం కోల్పోయాడు.. ఒక వ్యక్తిగత వ్యవహారం.. ప్రపంచ టెక్ రంగంలో కలకలం రేపిందంటే మామూలు విషయం కాదు.. కార్పొరేట్ ప్రపంచంలో వ్యక్తిగత జీవితం.. కంపెనీ ప్రతిష్ఠ.. పెట్టుబడిదారుల నమ్మకం ఎంత బలంగా ముడిపడి ఉంటాయో ఎన్వీడియా వ్యవహారం మరోసారి చర్చకు తెరలేపింది.చిప్‌లతో ప్రపంచాన్ని ఏలుతున్న టెక్ దిగ్గజం ఎన్వీడియా బోర్డు రూమ్‌లో ఇప్పుడు చిప్‌ల మోత కంటే.. గాసిప్‌ల మోతే ఎక్కువగా వినిపిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విప్లవంతో ట్రిలియన్ల డాలర్ల సామ్రాజ్యాన్ని నిర్మించిన సీఈవో జెన్‌సెన్ హువాంగ్.. ఇప్పుడు టెక్నాలజీతో కాదు.. తన 'వ్యక్తిగత టెక్' కనెక్షన్లతో గ్లోబల్ మార్కెట్‌లో సునామీ సృష్టించారు.కంపెనీ వ్యాపారం ఒక్క రోజులో పడిపోలేదు. చిప్ ఫ్యాక్టరీలు మూతబడలేదు. అయినాసరే ఒక్క వ్యక్తిగత వ్యవహారం కారణంగా ఏకంగా రూ.18 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద గాల్లో కలిసిపోయింది. బిజినెస్ అంటే ప్రాఫిట్‌లు, ప్రొడక్షన్ అనుకునేవాళ్లకు.. "అసలు కథ బెడ్‌రూమ్ నుంచి బోర్డు రూమ్‌కి ఎలా మారుతుందో" ఎన్వీడియా ఉదంతం కళ్లకు కట్టింది.ఎన్వీడియా సీఈవోకు చైనా 'స్పై అలైస్'తో సంబంధాలున్నాయంటూ సోషల్ మీడియాలో సాగుతున్న ప్రచారం ఇప్పుడు వాల్ స్ట్రీట్‌లో మంటలు పుట్టిస్తోంది. అసలు చిప్‌లు ఎగుమతి కాకపోయినా.. సీఈవో గారి లవ్ స్టోరీ ఎగుమతులు మాత్రం సరిహద్దులు దాటి మార్కెట్‌ను కుదిపేస్తున్నాయి. అమెరికా-చైనా టెక్ వార్ నడుస్తున్న తరుణంలో ఈ ఎఫైర్ పుకార్లు కేవలం రొమాంటిక్ గోసిప్ లాగా కాకుండా 'నేషనల్ సెక్యూరిటీ' రేంజ్‌లోకి వెళ్లిపోయాయి. "రేపు పొద్దున మన కంపెనీ సీక్రెట్స్ కూడా ఆ లవ్ స్టోరీతో పాటు చైనాకి వాట్సాప్ ఫార్వర్డ్ అయిపోతాయేమో" అని ఇన్వెస్టర్లు హడలిపోతున్నారు.

ఇక్కడ అసలైన మ్యాటర్ ఏంటంటే.. ఈ ఆరోపణల్లో నిజానిజాలు బయటపడ్డాయి. తాను ఓ చైనీస్ వ్యాపారవేత్తతో ఎఫైర్ పెట్టుకున్నట్టు ఎన్వీడియా సీఈవో బయటపడ్డాడు.. దీంతో మార్కెట్ భయంతో హడలిపోయింది. ఎందుకంటే ఎన్వీడియా అంటేనే జెన్‌సెన్ హువాంగ్.. లెదర్ జాకెట్ వేసుకుని ఆయన స్టేజ్ మీదకొస్తే చాలు.. షేర్లు రాకెట్ లా దూసుకుపోతాయి. కానీ అదే ఐకాన్ ఇప్పుడు వివాదాల్లో చిక్కుకునేసరికి ఇన్వెస్టర్లకు ఫ్యూజులు ఎగిరిపోయాయి.

అసలు టెక్నాలజీతో ప్రపంచాన్ని శాసిస్తున్న కంపెనీకి.. ఇప్పుడు ఇద్దరు వ్యక్తుల మధ్య నడిచే సంబంధాలు ఒక పెద్ద ముప్పై రోజుల్లో తేల్చాల్సిన పరీక్షగా మారాయి. టెక్నాలజీలో గూఢచారులున్నా కనిపెట్టే ఏఐ టూల్స్ తయారు చేసే ఎన్వీడియా.. సొంత సీఈవో విషయంలో మాత్రం గుడ్డిలో మెళ్లలాగా చూస్తూ కూర్చోవాల్సి వచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత తెలివైనదైనా.. కార్పొరేట్ సెంటిమెంట్ ముందు బలాదూర్ అని ఈ ఘటన మరోసారి నిరూపించింది.

బొట్టు పెట్టే ముందు పూజా పళ్ళెంలో ఇవి తప్పనిసరిగా ఉండాలి.. మర్చిపోకండి!



దీపావళి ఐదు రోజుల పండుగలో చివరి రోజున భాయ్ దూజ్ దూజ్ పూజా పళ్ళెంలో ఏయే వస్తువులు ఉండాలో పండుగను జరుపుకుంటారు. ఈ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉండే ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఈ రోజున అక్కాచెల్లెళ్లు వారి అన్నాతమ్ముళ్లకు నుదుటిపై తిలకం పెట్టి, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని దేవుడిని ప్రార్థిస్తారు. అన్నాతమ్ముళ్లు కూడా వారి అక్కాచెల్లెళ్లకు బహుమతులు ఇచ్చి, జీవితాంతం వారికి అండగా ఉంటామని మాట ఇస్తారు.

భాయ్ దూజ్ పండుగలో తిలకం పెట్టే కార్యక్రమానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఈ సమయంలో పూజా పళ్ళెం కూడా చాలా ముఖ్యమైనది. తిలకం పెట్టే ముందు పళ్ళెంలో అవసరమైన వస్తువులన్నీ సిద్ధంగా ఉంచుకోవాలి. అయితే కొన్నిసార్లు హడావుడిలో కొన్ని వస్తువులను మర్చిపోతుంటారు. మరి భాయ్ దూజ్ పూజా పళ్ళెంలో ఏయే వస్తువులు ఉండాలో తెలుసుకుందామా....

భాయ్ దూజ్ పూజా పళ్ళెంలో ఉండాల్సిన వస్తువులు:

1. కుంకుమ, గంధం : సోదరుడికి తిలకం పెట్టడానికి కుంకుమ, గంధం పళ్ళెంలో తప్పనిసరిగా ఉంచుకోవాలి.
2. అక్షింతలు: తిలకం పెట్టిన తర్వాత నుదుటిపై అక్షింతలు వేస్తారు. ఇందుకోసం విరగని బియ్యపు గింజలను ఉపయోగించాలి. అక్షింతలు వేయడం శుభప్రదంగా భావిస్తారు.
3. నెయ్యి దీపం: సోదరుడికి హారతి ఇవ్వడానికి నెయ్యితో వెలిగించిన దీపాన్ని పళ్ళెంలో ఉంచుకోవాలి.
4. మిఠాయిలు: తిలకం కార్యక్రమం పూర్తయ్యాక సోదరుడికి స్వీట్లు తినిపిస్తారు. అందుకే పూజా పళ్ళెంలో మిఠాయిలు సిద్ధంగా పెట్టుకోవాలి.
5. కొబ్బరికాయ: భాయ్ దూజ్ పూజలో కొబ్బరికాయకు కూడా ప్రాధాన్యత ఉంటుంది. అందుకే పూజా పళ్ళెంలో కొబ్బరికాయను ఉంచుకోవాలి.
6. పవిత్రమైన దారం: సోదరుడి కుడి చేతి మణికట్టుకు కట్టడానికి పవిత్రమైన దారంను పళ్ళెంలో ఉంచాలి. ఇది శుభానికి, రక్షణకు చిహ్నంగా భావిస్తారు.
7. తాజా పూలు: పూజా పళ్ళెం అందంగా కనిపించడంతో పాటు పూజలో ఉపయోగించేందుకు తాజా పూలను ఉంచుకోవాలి.
8. తమలపాకులు, వక్క: పూజా కార్యక్రమంలో శుభప్రదంగా భావించే తమలపాకులు, వక్కలను కూడా పళ్ళెంలో పెట్టుకోవాలి.

తిలకం పెట్టేటప్పుడు ఈ విషయాలు గుర్తుంచుకోండి

భాయ్ దూజ్ రోజున సోదరుడు తిలకం పెట్టించుకునేటప్పుడు ఉత్తరం లేదా తూర్పు వైపు చూసి కూర్చోవాలని సంప్రదాయం చెబుతోంది. దక్షిణం వైపు చూసి తిలకం పెట్టించుకోకూడదని నమ్ముతారు.

తిలకం పెట్టడానికి ఎప్పుడూ విరగని పచ్చి బియ్యాన్ని మాత్రమే ఉపయోగించాలి.

పూజ సమయంలో అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల నల్లని దుస్తులు ధరించకూడదని సంప్రదాయం చెబుతోంది.

తిలకం పెట్టే వరకు అక్కాచెల్లెళ్లు ఆహారం తీసుకోకూడదని కొన్ని ఆచారాల్లో పాటిస్తారు.

భాయ్ దూజ్ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమను, అనుబంధాన్ని గుర్తుచేస్తుంది. ఈ రోజున సంప్రదాయం ప్రకారం పూజా పళ్ళెం సిద్ధం చేసుకుని, తిలకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ముందుగానే పూజకు కావాల్సిన వస్తువులన్నీ సిద్ధం చేసుకుంటే ఎలాంటి హడావుడి లేకుండా పండుగను ఆనందంగా జరుపుకోవచ్చు.

ఆధ్యాత్మికం: కార్తీకంలోఈ పూజ చేయండి.. ఇతరులను అవమానించిన దోషం పోతుంది.. ఇంద్రుడు చేసింది కూడా ఇదే..

కార్తీకమాసంలో గోవర్ధన పూజకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఎవరినైనా అవమానిస్తే తప్పకుండా క్షమాపణ చెప్పాలి. ఇందుకు నిదర్శనంగా ఇంద్రుడు .. శ్రీకృష్ణుడికి క్షమాపణ చెప్పాడు. అసలు ఎందుకు శ్రీకృష్ణుడిని ఇంద్రుడు అవమాన పర్చాడు.. ఆతరువాత ఏంజరిగింది. మొదలగు విషయాలను ఈ స్టోరీలో తెలుసుకుందాం. . . !

అవమానించడం.. క్షమాపణలు చెప్పడం ఈ తతంగం ఇప్పటిది కాదు.. శ్రీకృష్ణుని కాలం నుంచి కొనసాగుతుంది. ద్వాపరయుగంలో కూడా ఇంద్రుడు .. శ్రీకృష్ణుడిని అవమానించాడు. అప్పుడు ఆ పరమాత్మ మాయతో ఇంద్రుడికి అన్నపానీయాలకు ఇబ్బంది కలిగేలా చేశాడు. తన తప్పు తెలుసుకున్న ఇంద్రుడు .. శ్రీకృష్ణుడిని క్షమాపణ అడిగాడు. అయితే పగతోనో.. కక్షసాధించడానికో శ్రీకృష్ణుడు.. ఇంద్రుడిని ఇబ్బంది పెట్టలేదు. ఇతరులకు అనవసరంగా అమానిస్తే ఏం జరుగుతుంలో తరువాత తరాల వారికి తెలియజెప్పేందుకే ఇలా చేశాడు. అందుకే ఇందరుడు క్షమాపణ కోరిన వెంటనే వెంటనే ఆయనను ఇబ్బందుల నుంచి తొలగించాడు. ఈ ప్రక్రియలోనే గోవర్ధన పూజను ఇంద్రుడు చేసి శ్రీకృష్ణుడికి క్షమాపణ చెప్పాడని పురాణాల ద్వారా తెలుస్తుంది. ద్వాపర యుగంలో మథుర ప్రాంతంలో వర్షాలు కురిపించే దేవుడిగా ఇంద్రుడిని ఆ ప్రాంత ప్రజలు పూజించేవారు. శ్రీకృష్ణుడి పెంపుడు తండ్రి నందుడు కూడా ఈ పూజలో పాల్గొనేవారు. ఒకసారి శ్రీకృష్ణుడు ఇంద్రుడిని ఎందుకు పూజిస్తున్నారని నందుడిని ప్రశ్నించాడు. ఇంద్రుడి అనుగ్రహంతో వర్షాలు కురిస్తే పంటలు బాగా పండుతాయని... పశువులకు పచ్చిక దొరుకుతుందని, అందుకే ఇంద్రుడిని పూజిస్తున్నామని నందుడు చెబుతాడు. అయితే శ్రీకృష్ణుడు ఈ సంప్రదాయాన్ని వ్యతిరేకించాడు. తమ జీవనానికి ఆధారమైన గోవులు మేత మేసే గోవర్ధన పర్వతాన్ని పూజించాలని ప్రజలకు సూచించాడు. దీంతో ప్రజలు ఇంద్రుడి పూజకు బదులుగా గోవర్ధన పర్వతానికి పూజలు చేయడం ప్రారంభించారు.



భారీ వర్షాలు కురిపించిన ఇంద్రుడు

తనకు బదులుగా గోవర్ధనగిరికి పూజలు చేస్తున్నందుకు ఆగ్రహించిన ఇంద్రుడు అవమానంగా భావించాడు. ఆ ప్రజలను ఇబ్బంది పెట్టాలనుకున్న ఇంద్రుడు ఆ ప్రాంతంలో భారీ వర్షాలు కురిపించాడు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో తమను రక్షించాలని శ్రీకృష్ణుడిని ప్రజలు వేడుకున్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు తన చిటికెన వేలిపై గోవర్ధన పర్వతాన్ని ఎత్తి పట్టుకున్నాడు. ప్రజలందరూ తమ పశువులతో సహా ఆ పర్వతం కింద ఆశ్రయం పొందారు. ఎన్ని రోజులు వర్షాలు కురిసినా వారికి ఎలాంటి ప్రమాదం కలగలేదు. ఈ సమయంలో శ్రీకృష్ణుడికి రకరకాల ఆహార పదార్థాలను తయారుచేసి నైవేద్యంగా సమర్పించారు. ఈ సంప్రదాయమే క్రమంగా అన్నకూట్ భోగంగా ప్రసిద్ధి చెందిందని చెబుతారు.

ఇంద్రుడి క్షమాపణ..

శ్రీకృష్ణుడి మహిమను తెలుసుకున్న ఇంద్రుడు తన తప్పును గ్రహించాడు. అనంతరం శ్రీకృష్ణుడిని క్షమాపణ కోరాడు. అప్పుడు ఇంద్రుడు గోవర్ధనగిరి పర్వతానికి పూజచేసి ప్రదక్షిణలు చేశాడు. అప్పటి నుంచి ప్రజలను రక్షించిన శ్రీకృష్ణుడు ఇకపై గోవర్ధన పర్వతాన్ని పూజించాలని, దానికి ప్రదక్షిణలు చేయాలని సూచించినట్లు పండితులు చెబుతున్నారు. అప్పటి నుంచి పర్వతాకారంలో గోవర్ధనుడి ప్రతిమను రూపొందించి పూజించడం, అన్నకూట్ నైవేద్యాన్ని సమర్పించడం సంప్రదాయంగా కొనసాగుతోంది. కార్తీకమాసం ప్రారంభమైన తొలిరోజు ప్రదోష కాలంలో అంటే సాయంత్రం సమయంలో గోవర్ధనుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే ఇంట్లో అన్నధాన్యాలకు, సంపదకు లోటు ఉండదనిపండితులు చెబుతున్నారు.. అందుకే ఇతరులను అవమానిస్తే ఇబ్బందులు తప్పక వస్తాయి. అయితే జాతకంలో గ్రహాల బలం ఉంటే తాత్కాలికంగా ఇబ్బందులు ఉండకపోవచ్చు. కాని అవి బలహీనపడినప్పుడు ఇతరులను ఆ ఫలితం తప్పక అనుభవించి తీరాలి. అందుకే తెలిసి అవమానిస్తే క్షమాపణలు చెపితే ప్రాయశ్చిత్తం కలుగుతుంది. కలియుగంలో మానవులు ఒక్కోసారి ఏం తప్పులు చేస్తున్నారో.. వారు చేసే చర్యల వలన ఇతరులు అవమానాలు పొందుతున్నారనే విషయాన్ని కూడా గ్రహించలేదు. అందుకే కార్తీకమాసం తొలిరోజున సాయంత్రం శివాలయ దర్శనం చేసి.. అక్కడ గోవర్ధన పర్వతాన్ని తలచుకొని తెలిసీ.. తెలియక చేసిన ఇతరులను ఇబ్బంది పెట్టే పనులను క్షమించమని ప్రార్థించాలని పండితులు చెబుతున్నారు.

కార్తీకమాసంలో గోవర్ధన పూజను చేయాలి. ఈ పూజను చేయడం వలన ఇతరులను అవమానించిన దోషం తొలగుతుందని పండితులు చెబుతున్నారు. ఎవరైనా తెలియక ఇతరులను అవమానిస్తే గోవర్ధన పూజతో ఆ దోషం తొలగిపోతుందని పండితులు చెబుతున్నారు.

ఆయుష్మాన్ భారత్‌లో AI టెక్నాలజీ.. వేగంగా హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ సెటిల్‌మెంట్!



దేశ హెల్త్ కేర్ రంగంలో డిజిటల్ టెక్నాలజీ కీలక మార్పులకు శ్రీకారం చుట్టుతోంది. ముఖ్యంగా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ ఆరోగ్య భద్రతా పథకమైన ఆయుష్మాన్ భారత్, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలులో AI, ఆధునిక సాంకేతికతను జోడించి సేవలను మరింత మెరుగుపరిచేందుకు కేంద్రం సిద్ధమైంది. నేషనల్ హెల్త్ అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ కుమార్ బర్న్వాల్ స్పష్టం చేస్తూ.. ఆరోగ్య రంగానికి వెచ్చించే ప్రతి రూపాయి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా ఉపయోగపడాలని, టెక్నాలజీ, డేటా, ఏఐ ద్వారా నిర్ణయాలు మరింత వేగంగా, కచ్చితంగా అమలవుతాయని పేర్కొన్నారు.టెక్నాలజీ పురోగతిలో భాగంగా ఇన్సూరెన్స్ క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్ ప్రక్రియను మరింత వేగవంతం చేయనున్నారు. 'ఆటో-అజ్యుడికేషన్' ద్వారా క్లెయిమ్‌ల ప్రాసెసింగ్ సమయం, నిర్వహణ ఖర్చులు తగ్గనున్నాయి. అలాగే నేషనల్ యాంటీ ఫ్రాడ్ యూనిట్ ద్వారా వైద్య రంగంలో జరిగే మోసాలను అరికట్టడం, పారదర్శకతను పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించారు. దీనివల్ల అనర్హులకు నిధులు చేరకుండా అసలైన పేదలకు సకాలంలో వైద్య సాయం అందుతుంది.ఈ ఏఐ ప్రయాణంలో అత్యంత విప్లవాత్మకమైన అడుగు 'ఏఐ-ఎనేబుల్డ్ వాయిస్ స్క్రైబ్'. డాక్టర్, రోగి మధ్య జరిగే సంభాషణను ఆటోమేటిక్‌గా వివిధ భారతీయ భాషల్లో డిజిటల్ క్లినికల్ రికార్డులుగా మార్చే సాంకేతికతను ఎన్హెచ్ఏ ప్రదర్శించింది. డాక్టర్లు వాటిని పరిశీలించి ఆమోదించిన తర్వాత నేరుగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌తో లింక్ చేస్తారు. దీనివల్ల వైద్యులపై రికార్డుల భారం తగ్గి, ఆసుపత్రులు పూర్తిగా డిజిటల్ రికార్డుల వైపు అడుగులు వేయడానికి వీలవుతుంది. అంతేకాకుండా నేషనల్ హెల్త్ క్లెయిమ్స్ ఎక్స్ఛేంజ్‌తో ఆసుపత్రుల ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ అనుసంధానం ద్వారా ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు మరింత వేగంగా క్లియర్ అవుతాయి. ఇక భారతీయ ఆరోగ్య రంగం అవసరాలకు తగినట్టుగా 'దీనా' అనే ప్లాట్‌ఫారమ్‌ను అభివృద్ధి చేశారు. దీని ద్వారా ఏఐ మోడళ్ల పనితీరును అంచనా వేయవచ్చు. కేవలం ఫైలింగ్, ఫైనాన్సింగ్ మీదే కాకుండా.. అసలైన ఆరోగ్య ఫలితాలపై దృష్టిసారించడమే లక్ష్యంగా ఈ డిజిటల్ సంస్కరణలు కొనసాగుతున్నాయి. ఈ టెక్ విప్లవం ద్వారా సామాన్యులకు నాణ్యమైన వైద్యం మరింత సులభంగా, వేగంగా చేరువ కానుంది.

ఉసిరికాయతో పులిహోర..కమ్మగా ఉంటుంది.. ఒక్కసారి తింటే అసలు వదిలి పెట్టరు..!

పులిహోర అంటే చాలు జనాలు ప్లేట్లను ఖాళీగా ఉంచుకుంటారు. ఎప్పుడూ రెగ్యులర్? గా చేసే చింతపండు.. నిమ్మకాయ పులిహోర అంటే బోర్? కొడుతుంది కదా..! మరి కార్తీకమాసంలో స్పెషల్? గావచ్చే ఉసిరికాయలతో పులిహోర చేస్తే లొట్టలు వేస్తూ లాగిస్తారు. మరి ఉసిరి పులిహోరను ఎలా తయారు చేయాలో ఈ స్టోరీలో తెలుసుకుందాం. ..!

కార్తీక మాసం అనగానే వనభోజనాలు ఉసిరి చెట్టుకు పూజ చేయడం, ఉసిరి చెట్టు కింద భోజనం చేయడం చేస్తుంటాం. అలాంటి వాటిలో ఉసిరాకాయతో పులిహోరను వడ్డించారంటే ప్రతి ఏడాది వనభోజనాలకు మీ దగ్గరకు రావాల్సిందే..!

ఉసిరికాయ పులిహోర తయారీకి కావాల్సినవి

బియ్యం: మూడు కప్పులు, పసుపు: రెండు స్పూన్లు, ఉసిరికాయ తురుము: 10 ఉసిరికాయల , ఉప్పు: తగినంత , వేరుశెనగ నూనె: ఆరు టేబుల్ స్పూన్లు , ఆవాలు : 2 టీస్పూన్లు, జీలకర్ర : 2 టీస్పూన్లు, జీడిపప్పు : 10, పచ్చి శెనగపప్పు: 4 టేబుల్ స్పూన్లు ఎండి మిరపకాయలు: 15, నల్ల మినపప్పు : ఒక టేబుల్ స్పూన్ , అల్లం తరుగు : ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, ఇంగువ: రెండు టేబుల్ స్పూన్లు , కొత్తిమీర : కొద్దిగా, కరివేపాకు: కొద్దిగా

ఉసిరికాయ పులిహోర తయారీ విధానం

బియ్యాన్ని శుభ్రంగా కడిగి నానబెట్టకుండా ప్రెషర్ కుక్కర్ లో నీళ్లు పోసి ..కొద్దిగా ఉప్పువేసి ఉడికించుకోవాలి. అయితే ఒకవిజిల్? వచ్చే వరకు పెద్ద మంటపై మూడు విజిల్స్? వచ్చే వరకు మీడియం మంటపై ఉంచాలి. ఇప్పుడు స్టవ్? ఆపేసి.. ఒక వెడల్పాటి బేసన్? తీసుకొని దానికి నూనె రాసి అందులో అన్నాన్ని వేయాలి. అన్నం వేడిగా ఉన్నప్పుడే అందులో సరిపడ ఉప్పు... పసుపు, వేరుశెనగ నూనె వేసి అన్నాన్ని కలుపుకోవాలి.అన్నం చల్లారేలోగా ఉసిరికాయలను తురుముకోవాలి. ఇప్పుడు పోపు కోసం కళాయిను పొయ్యిపై పెట్టి నూనె వేడి చేయాలి. నూనె వేడెక్కిన తరువాత నూనెలో నల్ల మినపప్పు , జీడిపప్పు, పచ్చిశనగపప్పు ఎర్రగా వేయించాలి. అందులోనే జీడిపప్పు కాస్త ఎర్రబడేంత వరకు వేయించాలి. తరువాత ఆవాలు, జీలకర్ర, సన్నని అల్లం తరుగు, మిరపకాయలు వేసి వేయించాలి. . మిరపకాయలు కాస్త రంగు మారగానే అందులో కొద్దిగా కరివేపాకు, చిటికెడు ఇంగువ వేసి కలపండి. ఆ తర్వాత స్టవ్ ఆపేసి ఈ మిశ్రమంలో ఉసిరికాయ తురుము వేయాలి. -తర్వాత స్టవ్ ఆన్ చేసి ఆ బాండీలోనే పసుపు కలుపుకుని పక్కన ఉంచుకున్న అన్నం వేయండి. కాస్త ఎక్కువగా కొత్తిమీర చల్లుకుని మొత్తం బాగా కలిసేలా కలుపుకుని తర్వాత స్టవ్ ఆపేయండి. -అంతే ఉపిరికాయ పలిహోర రెడీ. అయితే దీన్ని వెంటనే తినకుండా 1 గంట ఆగి తింటే ఫ్లేవర్స్ అన్నీ రైస్ కి పట్టి రుచి ఇంకా అద్భుతంగా ఉంటుంది.

జ్యోతిష్యం: ఏ రెండు గ్రహాలు కలిస్తే ఎలా ఉంటుంది..

ఏ సమయంలో పుట్టిన వారు ఎలాంటి లక్షణాలు కలిగి ఉంటారు..!

జ్యోతిష్య శాస్త్రంలో గ్రహాలు అత్యంత కీలకమైనవి. రెండు విభిన్న స్వభావాలు కలిగిన గ్రహాలు ఒకే రాశిలో కలిసినప్పుడు, అవి మానవ జీవితం, వ్యక్తిత్వం మరియు భవిష్యత్తుపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతాయి. పండితులు తెలిపిన వివరాల ప్రకారం ఏ రెండు గ్రహాలు కలిస్తే ఎలాంటి ప్రభావం ఉంటుందో ఈ స్టోరీలో తెలుసుకుందాం. . .!

1. సూర్యుడు + బుధుడు : ఈ రెండు గ్రహాలు కలిసి ఒకే రాశిలో సంచరిస్తే బుధాదిత్య యోగం ఏర్పడుతుంది. ఈ యోగ సమయంలో పుట్టిన వారు ప్రతి విషయంలో కూడా చాలా ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు. నవగ్రహాలకు రాజు అయిన సూర్యుడు అధికారం విషయంలో కీలకపాత్ర పోషిస్తాడు,.. బుధుడు బుద్ధికారకుడు .. ఈ రెండు గ్రహాలు జాతకంలో 1, 4, 5, 7, 9, 10 స్థానాల్లో బలంగా ఉన్నప్పుడు అద్భుతమైన ఫలితాలను ఇస్తుంది. ? వీరిలో నాయకత్వ లక్షణాలతో పాటు విపరీతమైన తెలివితేటలు ఉంటాయి. ఏ విషయాన్నైనా త్వరగా గ్రహిస్తారు.
2. చంద్రుడు + గురువు : ఈ రెండు గ్రహాలు కలిసినప్పుడు గజకేసరి యోగం ఏర్పడుతుంది. ఈ యోగంలో పుట్టిన వారి సలహాలు పాటిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. మనస్సును ప్రభావితం చేసే చంద్రుడు.. జ్ఞానానికి కారణమైన గురువు కలిసి 1, 4, 7, 10 స్థానాల్లో ఉన్న వారికి ఏనుగు ఉన్న శక్తి ఉంటుందని పండితులు చెబుతున్నారు. వీరు ప్రశాంతమైన మనస్తత్వం, దయాగుణం, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉంటారు. ఇతరుల కష్టాలను అర్థం చేసుకునే గుణం ఉంటుంది.
3. సూర్యుడు + కుజుడు: ఈరెండు గ్రహాల కలిసిన సంయంలో పుట్టిన వారు భయంలేని నాయకుడుగా చెలామణి అవుతారు. వీరికి ప్రతి



విషయంలో కూడా శక్తి, ధైర్యం చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ రెండు మిత్రగ్రహాలు కలవడం వల్ల విపరీతమైన శక్తి ఉద్భవిస్తుంది.
వీరు అత్యంత ధైర్యసాహసాలు కలిగిన వారు. వీరికి భయం అంటే తెలియదు. ఎదురుదెబ్బలు తగిలినా వెనకడుగు వేయరు. అయితే, ఒక్కోసారి కోపం, మొండితనం ఎక్కువగా ఉండే ప్రమాదం ఉంది.
4. చంద్రుడు + రాహువు: ఈ రెండు గ్రహాలు కలిసి ఒకేరాశిలో సంచరించే సమయంలో జన్మించిన వారి వ్యూహాలు ఇతరులకు ఏమాత్రం అర్థంకావు. చంద్రుడు మనస్సుకు అధిపతి అయితే, రాహువు భ్రమలకు, అతీత శక్తులకు, సరిహద్దులు లేని ఆలోచనలకు కారకుడు. ఈ రెండు గ్రహాలు అనుకూల స్థానాల్లో ఉంటే ఇది విలక్షణమైన మేధస్సును ఇస్తుంది.
5. బుధుడు + రాహువు: ఈ రెండు గ్రహాలు కలిసి సంచరించే సమయంలో జన్మించిన వారు ప్రతి విషయంలో కూడా లౌక్యంగా వ్యవహరిస్తారు. బుధుడు లౌక్యానికి, వ్యాపారానికి కారకుడు. రాహువు ఆధునిక సాంకేతికతకు, షార్ట్‌కట్స్‌కు కారకుడు. ఈ ఇద్దరి కలయిక ప్రస్తుత డిజిటల్ యుగానికి పర్ఫెక్ట్ కాంబినేషన్ అని జ్యోతిష్య పండితులు చెబుతున్నారు. వీరు చాలా వేగంగా ఆలోచిస్తారు. సమయస్ఫూర్తి ఎక్కువ. అవతలి వారి మైండ్ గేమ్‌ను సులభంగా పసిగట్టగలరు.
6. శుక్రుడు +గురువు: ఈరెండు గ్రహాలు చాలా మంచివి. ఈ రెండు గ్రహాలు ఒకేరాశిలో సంచరించే సమయంలో జన్మించిన వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు .వీరి జీవితం రాజులా గడపాలని కోరుకుంటారు. మంచి అభిరుచులు ఉంటాయి. ఎంత ఖర్చు చేసినా, అంతకు రెట్టింపు సంపాదించే యోగం ఉంటుంది.
7. కుజుడు + కేతువు: ఈ రెండు గ్రహాలు ఒకే రాశిలో సంచరించే సమయంలో పిశాచయోగం ఏర్పడుతుంది. వీరు బయటకు చాలా ప్రశాంతంగా కనిపించినా వీరు ఆలోచనలు చాలా భయంకరంగా ఉంటాయి. ఇతరులకు తెలియకుండా పావులు కదుపుతుంటారు. అనవసర విషయాలకు శక్తిని వృధా చేయడం వలన కొన్ని ఇబ్బందులు పడతారు.
8. శని + గురువు: ఈ రెండు గ్రహాలు కలిసినప్పుడు ర్మ-కర్మాధిపతి యోగం ఏర్పడుతుంది.

కర్మకారకుడైన శని, ధర్మకారకుడైన గురువు కలయిక అత్యంత పవిత్రమైనది. జీవితంలో క్రమశిక్షణ, న్యాయం, ఆధ్యాత్మికతను ప్రభావితం చేస్తుంది. ఈ యోగంలో జన్మించిన వారు అత్యంత పరిణతి చెందిన స్వభావం కలిగి ఉంటారు. వీరికి ఓర్పు, సహనం చాలా ఎక్కువగా ఉంటుంది . చిన్న వయసులోనే పెద్దల మాదిరిగా ఆలోచనలు చేస్తారు.
9. శుక్రుడు + చంద్రుడు: ఈ రెండు గ్రహాలు కలిసి ఒకే రాశిలో సంచరించేటప్పుడు జన్మించిన వారు చాలా అద్భుతమైన సృజనాత్మకత కలిగి ఉంటారు. వీరు చాలా అందంగా ఉంటారు. వీరి మనస్సు చాలా సున్నితంగా ఉంటుంది. వీరికి ప్రేమాభిమానాలు చాలా ఎక్కువగా ఉంటాయి. ఫ్యాషన్, అలంకరణ పట్ల ఆసక్తి కలిగి ఉంటారు.
10. సూర్యుడు + శని: ఈరెండు గ్రహాలు తండ్రీ కొడుకులు. సూర్యుడు వెలుగును ఇస్తే, శని చీకటిని.. క్రమశిక్షణను సూచిస్తాడు. ఈ రెండు గ్రహాలు కలిసి ఒకే రాశిలో సంచరించే సమయంలో పుట్టిన వారి జీవితంలో తీవ్రమైన సంఘర్షణ ఉంటుంది. చిన్నతనం నుండి బాధ్యతలు మోయాల్సి వస్తుంది. తండ్రితో కొన్ని విభేదాల వలన దూరంగా ఉంటారు. లేదా చిన్నవయస్సులో తండ్రి మరణం జరుగుతుంది. ఎంతటి కష్టం వచ్చినా విపరీతమైన పట్టుదల కలిగి కలిగి ఉంటారు. వీరి జీవితం తొలిదశలో కష్టాలు ఉన్నప్పటికీ, 36 సంవత్సరాల వయసు దాటిన తర్వాత స్వయంకృషితో సమాజంలో అత్యున్నత స్థాయికి చేరుకుంటారు. పొలిటికల్ లీడర్లుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతారు.
11. గురువు + కుజుడు: ఈ రెండు గ్రహాలు కలిసి ఒకే రాశిలో సంచరించే సమయంఓ గురు-మంగళ యోగం ఏర్పడుతుంది. ఈ యోగంలో జన్మించిన వారు నీతి, నిజాయితీలకు ప్రాధాన్యం ఇస్తారు. అన్యాయాన్ని సహించరు. సమాజంలో మార్పు తీసుకురావాలనే తపన ఉంటుంది.

సంపాదకీయం


ప్రవాస దౌత్యం!

విదేశాల్లో భారత మూలాలున్న వ్యక్తి ఏ విజయం సాధించినా మన దేశంలో సంబరం మొదలవుతుంది. తాజా అమెరికా ఎన్నికలు అందుకు మరో ఉదాహరణ. లాస్ ఏంజెలెస్ మేయర్‌గా కేరళలో పుట్టి ఆరేళ్ల వయసులో అమెరికా వెళ్లిన నిత్యా రామన్ ఎన్నికయ్యారు. అక్కడి లెక్కింపు ఇంకా అధికారికంగా పూర్తి కాలేదు. అయినా ఆమె అప్పటి మేయర్ కరెన్ బాస్‌పై స్పష్టమైన ఆధిక్యంతో గెలిచారు. ఈ ఏడాది జనవరిలోనే జోహ్రాన్ మామ్దానీ న్యూయార్క్ మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. దీంతో అమెరికాలోని రెండు అతిపెద్ద నగరాలను భారత మూలాలున్న నాయకులు నడిపించబోతున్నారు. మిషిగన్ నుంచి సెనేట్‌కు ఎన్నికైన అబ్దుల్ ఎల్-సయ్యద్ అమెరికా సెనేట్‌లో తొలి ముస్లిం సభ్యుడు. ఆయన భార్య డాక్టర్ సారా జుకాకు కర్ణాటక మూలాలున్న కుటుంబం నుంచి వచ్చారు. ప్రతినిధుల సభలో అమీ బెరా, రో ఖన్నా, ప్రమీలా జయపాల్, సుహాస్ సుబ్రమణ్యం తిరిగి గెలిచారు. ఫ్లోరిడా నుంచి పియా దండియా కొత్తగా సభలో అడుగుపెడుతున్నారు. ఈ విజయాలు గర్వకారణమే. ప్రవాస భారతీయులు మన దేశానికి సాంస్కృతికంగా, దౌత్యపరంగా ఒక బలం అనడంలో సందేహం లేదు. కానీ, ప్రవాస సమాజం అంటే ఒకే గొంతు కాదు. వారు తాము నివసిస్తున్న దేశ పౌరులు, ఆ దేశ రాజకీయాల్లో తమ సొంత అభిప్రాయాలతో పాల్గొంటారు. కాబట్టి వారి రాజకీయ చురుకుదనం భారత ప్రయోజనాలకు ఒక్కోసారి లాభం, ఒక్కోసారి నష్టం కలిగించవచ్చు. ఆ ప్రవాసులకు ఆతిథ్య దేశంలో హోదా, పలుకుబడి ఉన్నప్పుడే వారు మన దౌత్యానికి ఆస్తి అవుతారు. దీనికి చరిత్రలో ఉదాహరణలు ఉన్నాయి. ఒకప్పుడు అమెరికాలోని భారతీయులను ఉన్నత చదువులు చదివి, పన్నులు చెల్లించి, పిల్లలను బాగా చదివించే క్రమశిక్షణ గల సమాజంగా చూసేవారు. ఆ గౌరవం వల్లే 1990ల్లో, 2000ల తొలినాళ్లలో అమెరికా కాంగ్రెస్‌లో భారత్‌కు మద్దతు పెరిగింది. 1998లో పోఖ్రాన్ అణు పరీక్షల తర్వాత అమెరికా ఆంక్షలు విధించినా వాజ్‌పేయి ప్రభుత్వం పరిణామాలను తగ్గించి సంబంధాలను నిలబెట్టగలిగింది. పౌర అణు ఒప్పందం సమయంలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం కూడా ప్రవాసుల పలుకుబడిని వాడుకుని అమెరికాలో విస్తృత రాజకీయ మద్దతు సాధించింది. 2015 గణతంత్ర దినోత్సవానికి అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా ముఖ్య అతిథిగా రావడం ఆ సద్భావనకు కొనసాగింపు.

అయితే కాలం మారింది, ప్రవాస సమాజమూ మారింది. నేటి ప్రవాసుల్లో వివిధ వృత్తులు, నేపథ్యాలు, భావజాలాలున్నాయి. ఇది సహజం! ఇందులో ఒక వర్గం ప్రధాని నరేంద్ర మోదీ విధానాలకు గట్టి మద్దతుదారులు. మరో వర్గం కఠినమైన విమర్శకులు. ప్రధానంగా మోదీ-ట్రంప్ వ్యక్తిగత సాన్నిహిత్యంపై ఆశలు పెట్టుకుని సంబంధాలను నడపవచ్చని భావించడం వ్యూహాత్మకంగా సరిపోదని విశ్లేషకులు అంటున్నారు. గత ఏడాది అమెరికా భారీ సుంకాలు విధించినప్పుడు ఇది తేటతెల్లమైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో సుంకాలను 18 శాతానికి తగ్గిస్తామని ప్రకటన వచ్చింది. రష్యా చమురు కొనుగోళ్లు తగ్గించడం, అమెరికా వస్తువులకు మార్కెట్ తెరవడం వంటివి అందులో భాగం. కానీ తర్వాత అమెరికా సుప్రీంకోర్టు అత్యవసర అధికారాల చట్టం కింద సుంకాలు విధించడం చెల్లదని తీర్పు ఇచ్చింది. దీంతో పరిస్థితి మళ్లీ మారింది. పూర్తి వాణిజ్య ఒప్పందం ఇప్పటికీ ఖరారు కాలేదనే నివేదికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాలో భారతీయ మూలాలున్న నాయకులతో మన ప్రభుత్వ వైఖరి మరింత ముఖ్యమవుతోంది. భారత విమర్శకులైన అమెరికా ప్రజాప్రతినిధులతో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై విమర్శలు ఉన్నాయి. ప్రమీలా జయపాల్ మోదీ ప్రభుత్వ మతపరమైన విధానాలను విమర్శించినప్పుడు ఆమెను దూరం పెట్టారు. మామ్దానీ విషయంలోనూ అదే జరిగింది. ఆయన జైలులో ఉన్న కార్యకర్త ఉమర్ ఖాలిద్‌కు మద్దతుగా లేఖ రాసినప్పుడు, విదేశాంగ శాఖ దీన్ని గట్టిగా తప్పుబట్టింది. ముందు సొంత బాధ్యతలపై దృష్టి పెట్టాలని సూచించింది. ప్రభుత్వ వాదనకు కూడా బలం ఉంది. మామ్దానీ గతంలో మోదీని 'యుద్ధ నేరస్తుడు' అని అనడం చాలామంది భారతీయులకు అభ్యంతరకరంగా అనిపించింది. 2002 గుజరాత్ అల్లర్లలో మోదీ పాత్రపై న్యాయస్థానాల్లో ఆయనకు క్లీన్ చిట్ వచ్చిందని మద్దతుదారులు గుర్తు చేస్తారు. ఒక విదేశీ నగర మేయర్ భారత అంతర్గత వ్యవహారాలపై వ్యాఖ్యానించడం సరికాదనే అభిప్రాయం కూడా ఉంది. అయినా దౌత్య కోణంలో చూస్తే ఒక ప్రశ్న మిగులుతుంది. న్యూయార్క్, లాస్ ఏంజెలెస్ వంటి మహానగరాల ప్రజలు ఎన్నుకున్న నాయకులను భారత దౌత్యం పూర్తిగా విస్మరించగలదా? విమర్శకులతో కూడా సంభాషణ కొనసాగించడమే పరిణతి గల దౌత్యం. స్నేహితులను పెంచుకోవడం, అభిప్రాయాలను ప్రభావితం చేయడం దౌత్యం లక్ష్యం. విదేశాల్లో ఒక పక్షం వైపు నిలబడి మరొకరిని దూరం పెట్టడం కాదు.

ఇప్పుడు ఈ చర్చకు మరింత ప్రాధాన్యం వచ్చింది. అమెరికా కాంగ్రెస్‌లోని రెండు సభలూ డెమోక్రాట్ల చేతికి వెళ్లాయి. ఇకపై వాణిజ్యం, రక్షణ ఒప్పందాలు, మానవ హక్కుల చర్చల్లో వారి పాత్ర పెరుగుతుంది. ఒకే పార్టీ లేదా ఒకే నాయకుడి దయపై ఆధారపడే విదేశాంగ విధానం ఇక పనిచేయదు. అందుకే రెండు పార్టీలతో, అన్ని భావజాలాల నాయకులతో సంబంధాలు నిలబెట్టుకోవడం భారత్‌కు అవసరం. ఇక్కడ మరో అంశం చర్చకు వస్తోంది. కొత్త తరం దౌత్యవేత్తలు విదేశాల్లో హిందుత్వను, హిందూ ప్రయోజనాలను ప్రోత్సహించే పనులు చేస్తున్నారనే వార్తలు కొన్ని వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలను స్వతంత్రంగా ధృవీకరించలేము. ప్రభుత్వం కూడా ఇలాంటి వాదనలను అంగీకరించలేదు. కానీ ఇవి నిజమైనా కాకపోయినా, వాటిపై మీడియా, విశ్లేషకులు తగినంత లోతుగా పరిశీలించలేదన్న విమర్శ ఉంది. పారదర్శకంగా విచారించి వాస్తవాలు బయటపెట్టడమే దేశ ప్రతిష్ఠకు మేలు. ఇంకో వైపు, కొన్ని దేశాలు తమ గడ్డపై భారత రాజకీయ సభలు, మతపరమైన ప్రదర్శనలు, ఖలిస్తానీ ర్యాలీలు వంటివి జరగడాన్ని అందోళనగా చూస్తున్నాయి. వీటివల్ల భారత దౌత్యంపై అదనపు భారం పడుతోంది. చివరగా, ప్రపంచం భారత్‌ను ఎందుకు గౌరవిస్తోంది అని ఆలోచించాలి. వేగంగా ఎదుగుతున్న, బహుళత్వం కలిగిన, లౌకిక ప్రజాస్వామ్య దేశంగా మనకు ఉన్న గుర్తింపే మన అసలైన బలం. ఒకప్పుడు ప్రవాస భారతీయులు ప్రపంచానికి చూపించింది ఆ ముఖాన్నే. మన దౌత్యం ఆ ముఖాన్ని కాపాడుకుంటూ, అన్ని వైపులా తలుపులు తెరిచి ఉంచినప్పుడే ప్రవాస భారతీయుల విజయాలు నిజంగా దేశానికి ఆస్తి అవుతాయి!

పనికొచ్చే పలుకు



పడిలేచే పరుగు!

ఢిల్లీలోని ఒక మైదానం. 18 ఏళ్ల కుర్రాడు నాటౌట్‌గా క్రీజులో నిలిచి ఉన్నాడు. అంతకు ముందు రాత్రే అతని తండ్రి కన్నుమూశాడు. ఇప్పుడు అతనికి.. ఇంటికి వెళ్లి ఏడ్వాలా, జట్టును కాపాడాలా? అనే సందిగ్ధం. జట్టునే ఎంచుకున్నాడు. 90 పరుగులు చేశాకే.. తండ్రి అంత్యక్రియలకు వెళ్లాడు. ఆ కుర్రాడే -విరాట్ కోహ్లీ. ఈ కథలో మనకు ఉపయోగపడేది క్రికెట్ కాదు, ఆయన నడుచుకున్న తీరు. కోహ్లీ జీవితాన్ని చూస్తే ఐదు అలవాట్లు కనిపిస్తాయి. అవి మనం కూడా అలవరచుకోవచ్చు.

1. బాధను పక్కన పెట్టే శక్తి

శోకం లేనట్టు నటించడం కాదు. సరైన సమయానికి చేయాల్సిన పనిని పూర్తి చేసి, తర్వాత ఆ బాధను గౌరవించడం. ఇది అందరికీ సాధ్యం కాదు, అందరూ చేయాల్సిన అవసరమూ లేదు. కానీ ముఖ్యమైన బాధ్యత ముందున్నప్పుడు.. మానసిక దృఢత్వాన్ని పెంచుకోవడమే వాస్తవం.

2. ఒక్క రోజులో మారిన అలవాట్లు

ఒకప్పుడు కోహ్లీకి ఫిట్‌నెస్‌పై పెద్ద శ్రద్ధ ఉండేది కాదు. కానీ అగ్రస్థానం కావాలంటే అలవాట్లు మారాలని గ్రహించి, ఆహారం, వ్యాయామాన్ని పూర్తిగా మార్చుకున్నాడు. మనం కూడా "రేపటి నుంచి" అని వాయిదా వేసే అలవాటును వదిలేయాలి. ఈ రోజే ఒక్క అలవాటు మార్చి చూడండి: నిద్రపోయే వేళ, చక్కెర, లేదా రోజూ 30 నిమిషాల నడక.

3. ఓటమి నుంచి పాఠం

2014 ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్టుల్లో 134 పరుగులే చేసి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. ఆ దశలో తాను మానసికంగా చాలా కుంగిపోయానని తర్వాత అతనే చెప్పాడు. కానీ ఆగిపోలేదు. అనుభవజ్ఞుల సలహా తీసుకుని టెక్నిక్‌ను సరిదిద్దుకున్నాడు. అదే ఏడాది ఆస్ట్రేలియాలో నాలుగు సెంచరీలు కొట్టారు. ఇక్కడ పాఠం: సహాయం అడగడం బలహీనత కాదు. పరిష్కారం వెతికే తెలివి.

4. చేతలతోనే సమాధానం

విమర్శకులతో వాదించి సమయం వృథా చేయకుండా, ఆటతోనే బదులివ్వడం కోహ్లీ స్టయిల్. మనం కూడా సోషల్ మీడియా వాదనల్లో శక్తి ఖర్చు చేయకుండా, పనిలో నాణ్యత పెంచుకోవడమే మంచిది.

5. ఎగుడుదిగుళ్లలో సమతూకం

దాదాపు మూడేళ్ల పాటు సెంచరీ లేకుండా, కెప్టెన్సీ కూడా వదులుకున్నాడు. అప్పుడు విరామం తీసుకుని మానసిక ప్రశాంతతను వెతుక్కున్నాడు. తర్వాత 2022 ఆసియా కప్‌లో సెంచరీతో తిరిగి వచ్చాడు. అలసటగా అనిపించినప్పుడు విరామం తీసుకోవడం పిరికితనం కాదు, మళ్లీ వేగం అందుకునే ఏర్పాటు.

మూడు చిన్న పనులు చేసి చూడండి:

ఒక అలవాటును ఈ రోజే మార్చండి.

మీ రంగంలో మీకన్నా అనుభవమున్న ఒకరి సలహా అడగండి.

ఒక సాయంత్రం ఫోన్ పక్కన పెట్టి, మీ కోసం కాస్త సమయం గడపండి.

కోహ్లీ విజయం సెంచరీల్లో లేదు. ప్రతి పతనం తర్వాత లేవడంలో ఉంది. జీవితం ఒక మ్యాచ్ కాదు, మ్యాప్. సుదీర్ఘ సిరీస్. నిరంతర జర్నీ. ఒక ఇన్నింగ్స్ విఫలమైనంత మాత్రాన సిరీస్ ముగిసిపోదు.

కాలుష్యానికి 'నడ్జ్' మందు




కాలుష్య నివారణకు ప్రపంచవ్యాప్తంగా ప్రధానంగా రెండు మార్గాలు. మొదటిది 'ఆదేశం-నియంత్రణ'. అంటే చట్టాలు చేసి, నిబంధనలు పెట్టి, ఉల్లంఘించిన వారిని శిక్షించడం. రెండోది పర్యావరణ పన్నులు, సబ్సిడీల వంటి ఆర్థిక సంస్కరణలు. మన దేశంలో ఇన్నాళ్లూ మొదటి మార్గమే ప్రధాన ఆయుధం. వన్యప్రాణి రక్షణ చట్టం 1972, అటవీ పరిరక్షణ చట్టం 1980, నీటి కాలుష్య నివారణ చట్టం 1974, వాయు కాలుష్య నివారణ చట్టం 1981 దీనికి పునాది. అభివృద్ధి చెందిన అనేక దేశాల్లా మనం ఇప్పుడే పర్యావరణ పన్నుల మార్గంలోకి వెళ్లడం తొందరపాటే అవుతుంది. ఎందుకంటే అలాంటి పన్నులు అమలు కావాలంటే రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కావాలి, వాటిని జీఎస్టీ వ్యవస్థలో కలపడమూ సులువు కాదు. అయితే ఇక్కడ ఒక ప్రశ్న వస్తుంది. ప్రజలు రోజువారీ తీసుకునే నిర్ణయాలు కేవలం చట్టాలు, పన్నులు, నిబంధనల మీదే ఆధారపడతాయా? లేదా వారి ముందు ఆ ఎంపికలను ఎలా ఉంచుతున్నామన్నది కూడా ప్రభావం చూపుతుందా? కాలుష్యం విషయంలో ఈ ప్రశ్నకు చాలా ప్రాధాన్యముంది. మనం ఏం కొంటాం, ఎలా ప్రయాణిస్తాం, చెత్తను ఎలా పారేస్తాం అనే వ్యక్తిగత అలవాట్లే మొత్తం ఉద్గారాల్లో పెద్ద వాటా వహిస్తాయి. అందుకే 2021లో గ్లాస్గోలో జరిగిన కాప్ సదస్సులో భారత్ ప్రతిపాదించిన 'లైఫ్' (పర్యావరణం కోసం జీవనశైలి) ఉద్యమం ఇప్పుడు కీలకంగా మారుతోంది. పౌరులు పర్యావరణహిత జీవనశైలి వైపు మళ్లేలా చేయడమే దీని లక్ష్యం. ఇందులో ప్రవర్తనా శాస్త్రం చెప్పే 'నడ్జ్' అనే భావన ఉపయోగపడుతుంది. నడ్జ్ అంటే చిన్న మెత్తని తోపు. ప్రజల ఎంపిక స్వేచ్ఛను అడ్డుకోకుండా, ఆ ఎంపికలను అందించే తీరును కొద్దిగా మార్చి, కోరుకున్న మంచి నిర్ణయం వైపు నడిపించే పద్ధతి. ఇది అనేక రూపాల్లో ఉంటుంది. సమాచారాన్ని అర్థవంతంగా చెప్పడం, ముందే మంచి ఎంపికను 'డిఫాల్ట్'గా పెట్టడం, సమాజంలో చాలామంది చేస్తున్న మంచి పనిని ఆదర్శంగా చూపడం, తగిన ప్రోత్సాహకాలు ఇవ్వడం, మంచి అలవాటుకు అడ్డుగా నిలిచే అవరోధాలను తొలగించడం ఇలా వివిధ మార్గాలున్నాయి. చట్టం భయం కలిగిస్తే, నడ్జ్ అలవాటును మారుస్తుంది. రెండూ కలిస్తేనే ఫలితం బలంగా ఉంటుంది.

ఈ విధానం ఎక్కడ ఎలా పనిచేస్తుందో ముందుగా రవాణా రంగంలో చూద్దాం. ఎంత చెప్పినా ప్రజలు ప్రజా రవాణా వాడకపోవడానికి కారణాలున్నాయి. చివరి కిలోమీటర్ల వరకు సదుపాయం లేకపోవడం, భద్రతపై భయం, రద్దీ వేళల్లో విపరీతమైన ఇరుకువంటివి వారిని వెనక్కి లాగుతాయి. సంపన్న దేశాల్లో జరిగిన ప్రయోగాల్లో, ప్రతి ప్రయాణికుడికి తగినట్లు మార్గం చూపే స్పష్టమైన సమాచారం, ఎంత సమయం ఆదా అవుతుంది, ఎంత కాలుష్యం తగ్గుతుంది అనే వివరాలు ఇచ్చినప్పుడు ప్రజా రవాణా వాడకం పెరిగింది. హాంకాంగ్‌లో ఒక ప్రయోగం జరిగింది. రద్దీ ఎక్కువగా ఉండే 29 స్టేషన్లలో ఒకదానికి ఉదయం రద్దీ మొదలవడానికి ముందు ప్రయాణిస్తే 25 శాతం చార్జీ రాయితీ ఇచ్చారు. దాంతో ఆ స్టేషన్‌లో రైళ్ల రద్దీ 3 శాతం తగ్గింది. చిన్న రాయితీతో పెద్ద మార్పు వచ్చిన ఉదాహరణ ఇది. మన దేశంలోనూ ఇలాంటి ఆలోచనలకు అవకాశం ఉంది. ప్రతి రవాణా సాధనం ఎంత కాలుష్యం వెలువరిస్తుందో బహిరంగంగా ప్రదర్శించవచ్చు. తక్కువ కాలుష్యం కలిగిన మార్గాలను ఎంచుకున్న ప్రయాణికులకు 'ట్రావెల్ క్రెడిట్లు' ఇచ్చి, వాటిని తర్వాతి ప్రయాణాల్లో వాడుకునేలా చేయవచ్చు. బెంగళూరులో సాంకేతికత ఆధారంగా చేసిన ప్రవర్తనా అధ్యయనాలు, అడ్డంకులు తొలగిస్తే మెట్రో వాడకం పెరుగుతుందని చూపించాయి. ప్రజా రవాణా స్థలాల్లో నడక వల్ల ఎన్ని అడుగులు పడతాయి, ఎన్ని క్యాలరీలు ఖర్చవుతాయి అనే బోర్డులు పెడితే, రోజువారీ లక్ష్యాలను పట్టించుకునే వారు నడకకు ప్రాధాన్యమిస్తారు. ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఇంజిన్ ఆపే అలవాటు మన దేశంలో తక్కువ. ఇంగ్లండ్‌లోని కాంటర్‌బరీ రైల్వే గేటు దగ్గర జాగ్రత్తగా రూపొందించిన సూచన బోర్డులు ఇంజిన్ ఆన్‌లో ఉంచే డ్రైవర్ల సంఖ్యను తగ్గించాయి. ఆ బోర్డుల్లో మూడు రకాల సందేశాలు పనిచేశాయి. గాలి నాణ్యత మెరుగవుతుందనే ఫలితం, బాధ్యతగల డ్రైవర్‌గా సమాజంలో గౌరవం పొందే భావన, మన చర్యను మనమే ఆలోచించుకునే అవకాశం.

వర్ధమాన దేశాలను కలవరపెడుతున్న మరో సమస్య వ్యర్థాల నిర్వహణ, వినియోగ అలవాట్లు. 'వాడిన వస్తువును తిరిగి వాడటం, అనవసర వస్తువును నిరాకరించడం' అనే ఆలోచన ప్రజల్లో పెరగాలి. ఇందుకు ప్రజలకు శిక్షణ ఇవ్వడం కీలకం. పొడి చెత్త, తడి చెత్త, ప్రమాదకర ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఎలా వేరు చేయాలో ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. కేరళలో హరిత కేరళం మిషన్ ఇందుకు మంచి ఉదాహరణ. శిక్షణ పొందిన పర్యవేక్షకులు, కార్మికులు ఇంటింటికీ వెళ్లి నిర్ణీత సమయాల్లో చెత్తను సేకరిస్తారు, వేరు చేస్తారు. వినియోగదారుల నుంచి తీసుకునే రుసుము రీసైక్లింగ్ యూనిట్లకు వెళ్తుంది. ఇలాంటి నమూనాను దేశంలోని ఇతర మున్సిపాలిటీల్లోనూ అమలు చేయవచ్చు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల విషయంలో, పరికరాలను ఎక్కువ కాలం వాడినవారికి మంచి మార్పిడి ఆఫర్లు ఇవ్వవచ్చు. అప్పుడు ప్రజలు గాడ్జెట్లను తరచూ మార్చకుండా, ఆలోచించి కొని, జాగ్రత్తగా వాడుకుంటారు.

నిజానికి ప్రవర్తనా విధానం మనకు కొత్తది కాదు. ఇంధన రంగంలో దీనికి మంచి ఉదాహరణలు ఉన్నాయి. విద్యుత్ పరికరాలపై కనిపించే స్టార్ రేటింగ్ లేబుళ్లు, వాటి నిర్వహణ ఖర్చు వివరాలు ప్రజలను విద్యుత్ ఆదా చేసే పరికరాల వైపు నడిపించాయి. 2015లో ప్రారంభమైన 'గివ్ ఇట్ అప్' ప్రచారం కూడా అలాంటిదే. ఎల్‌పీజీ సబ్సిడీని స్వచ్ఛందంగా వదులుకోవాలని సంపన్నులను కోరిన ఈ కార్యక్రమం ప్రభుత్వ వనరులను అవసరమైన వారికి మళ్లించడంలో సహాయపడింది. ఈ అనుభవాలను ఇప్పుడు ఇంకా విస్తృతంగా అమలు చేయాలి. జపాన్‌లో ఫుకుషిమా ప్రమాదం తర్వాత ఆచరణీయ విద్యుత్ పొదుపు చిట్కాలతో విస్తృత ప్రచారం చేశారు, పరిశ్రమలకు సాంకేతిక సాయం అందించారు. దాంతో ఇంధన వినియోగం తగ్గింది. ఇలాంటి వ్యూహాలను స్థానిక సంస్థల ద్వారా రాష్ట్రాల్లో అమలు చేయవచ్చు. అయితే ఒక విషయాన్ని మనం మరువకూడదు. ప్రవర్తనా విధానం చట్టాలకు ప్రత్యామ్నాయం కాదు. దీనికి సంస్థాగత మద్దతు, బలమైన మౌలిక సదుపాయాలు, ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు తోడైతేనే ఫలితం ఉంటుంది. మెట్రో లేని నగరంలో 'ప్రజా రవాణా వాడండి' అని చెబితే ఉపయోగం ఉండదు. చెత్త సేకరణ వాహనమే రాని వీధిలో 'వేరు చేయండి' అని బోర్డు పెడితే ఫలితం రాదు. కాబట్టి ముందు సదుపాయాలు కల్పించి, తర్వాత ప్రజలను అలవాటు వైపు నడిపించాలి. కానీ ఈ అలవాటు మార్పు లేకుండా కాలుష్య నియంత్రణ, స్థిరమైన అభివృద్ధి సాధ్యం కాదు. ప్రతి శీతాకాలంలో మన నగరాలు పొగమంచులో చిక్కుకోవడం, నదులు నురుగులతో నిండిపోవడం చూస్తూనే ఉన్నాం. ప్రభుత్వం నిబంధనలు పెడుతుంది, కానీ రోడ్డుపై ఇంజిన్ ఆపేదీ, చెత్తను వేరు చేసేదీ, బస్సు ఎక్కేదీ మనమే. బాధ్యతగల పౌరులతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం. అందుకే చట్టం, మౌలిక సదుపాయాలు, నడ్జ్.. ఈ మూడూ కలిసి నడవాలి. అప్పుడే 'లైఫ్' ఉద్యమం నినాదంగా కాకుండా, ప్రతి ఇంట్లో ఆచరణగా మారుతుంది. ■



మనం పిల్లల ముందు అనే చిన్న మాటలు వారి ఆలోచనలో లోతుగా నాటుకుపోతాయి. "ఇది చాలా ఖరీదు", "మనకు అంత స్థోమత లేదు", "డబ్బు సంపాదించడం కష్టం" అనే మాటలు పిల్లల్లో డబ్బంటే భయాన్ని, లేమి భావనను పెంచుతాయి. వాటి బదులు "ప్రస్తుతం అది మన బడ్జెట్‌లో లేదు" అనండి. "ప్లాన్ చేసుకుని దాన్ని ఎలా సాధించవచ్చో ఆలోచిద్దాం" అని చేర్చండి. ఈ మార్పుతో పిల్లలు డబ్బును సమస్యగా కాకుండా, ప్రణాళికతో నడిపే సాధనంగా చూడటం నేర్చుకుంటారు.

-మహాదేవ

వింతల్లో వింతలు

ఆ ఒక్క నిర్ణయం...!



మేరీల్యాండ్‌లోని బాల్టిమోర్‌కు చెందిన ఓ మహిళ భర్తను "కన్వీనియన్స్ స్టోర్‌కు వెళ్తున్నావా? నాకో లాటరీ టికెట్ తెచ్చిపెట్టు" అని అడిగిందట. ఆయన తెచ్చిన 'ఎక్స్‌ట్రీమ్ గ్రీన్' టికెట్‌ను కొడుకు 18వ పుట్టినరోజుకు బహుమతిగా ఇద్దామనుకున్నారు. కానీ చివరి క్షణంలో మనసు మార్చుకుని తానే గీకారు. అంతే, రూ.40 లక్షల పైచిలుకు (రూ.50,000 డాలర్లు) జాక్‌పాట్! ఆ ఒక్క నిర్ణయం మారకపోతే, కొడుకు గిఫ్ట్ తీసుకునేవాడు. ఆ డబ్బుతో బిల్లులు కడతారట, పొదుపు పెంచుతారట, కొడుక్కి సాయం చేస్తారట.

తండ్రిని తలపించే బ్యాటింగ్.. సెహ్వాగ్ తనయుడి 160 పరుగుల విధ్వంసం

యూఏఈపై 168 బంతుల్లో ఆర్యవీర్ అద్భుత ఇన్నింగ్స్

అండర్-19 ఆసియా కప్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు

తొలుత ఆచితూచి ఆడిన ఆర్యవీర్.. కుదురుకున్నాక దూకుడు

తండ్రితో పాటు కోహ్లీ తనకు స్ఫూర్తి అన్న మాటను నిజం చేస్తున్న ఆర్యవీర్



భారత క్రికెట్‌లో మరో యువ సంచలనం వెలుగులోకి వచ్చాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను హడలెత్తించిన మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ వారసుడు ఆర్యవీర్ సెహ్వాగ్.. తండ్రి తరహాలోనే మైదానంలో దూకుడు చూపించాడు. అండర్-19 ఆసియా కప్ 2026లో భాగంగా మంగళవారం యూఏఈతో జరిగిన కీలక మ్యాచ్‌లో ఆర్యవీర్ 160 పరుగులతో చెలరేగాడు. 168 బంతులు ఎదుర్కొని భారీ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఒక ఇన్నింగ్స్‌లో నమోదైన అత్యధిక వ్యక్తిగత స్కోరు ఇదే.మ్యాచ్ ఆరంభంలో ఆర్యవీర్ ఆచితూచి ఆడాడు. తొలి పరుగులు చేసేందుకు 14 బంతులు తీసుకున్నాడు. క్రీజులో కుదురుకున్నాక మాత్రం ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కీలక మ్యాచ్‌లో అతడి శతకం భారత్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపింది. చివరకు 168 బంతుల్లో 160 పరుగులు చేసి ఔటయ్యాడు. 153 పరుగుల వద్దే ఈ టోర్నీలో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును అధిగమించాడు.

తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ తొలి బంతి నుంచే బౌలర్లపై దాడి చేసేవాడు.

అయితే ఆర్యవీర్ తన ఆటతీరులో తండ్రి దూకుడుతో పాటు విరాట్ కోహ్లీ నుంచి స్ఫూర్తి పొందుతున్నట్లు గతంలో వెల్లడించాడు. దూకుడుగా ఆడటమంటే తనకు ఇష్టమని, సెహ్వాగ్ శైలితో పాటు కోహ్లీ తరహాలోనూ క్రికెట్ ఆడాలనుకుంటున్నానని చెప్పాడు. ప్రత్యర్థి జట్లపై ఆధిపత్యం చెలాయించి భారత్‌కు విజయాలు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు. దాన్ని ఆచరణలో పెడుతున్నట్లు తాజా ఇన్నింగ్స్‌తో స్పష్టమవుతోంది.

ముంబై ఇండియన్స్‌కు అర్ష్‌దీప్ సింగ్.. ట్రేడ్ ఖరారు చేసిన తండ్రి!

- ఐపీఎల్‌లో భారీ ట్రేడ్.. ముంబై ఇండియన్స్‌కు మారిన అర్ష్‌దీప్ సింగ్
- ఈ ట్రేడ్‌ను అధికారికంగా ధ్రువీకరించిన అర్ష్‌దీప్ తండ్రి దర్శన్ సింగ్
- ముందస్తు సమాచారం లేకుండానే ఈ ట్రేడ్ జరగడం ఆశ్చర్యం కలిగించిందని వెల్లడి
- ముంబైలో రోహిత్, బుమ్రా వంటివారితో ఆడనుండటం సంతోషంగా ఉందని వ్యాఖ్య
- ఈ ఒప్పందంలో హార్దిక్ పాండ్యా పంజాబ్‌కు వెళ్లే విషయంపై స్పష్టత ఇవ్వని దర్శన్ సింగ్





ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు అతిపెద్ద సంచలనం నమోదైంది. యువ పేస్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ పంజాబ్ కింగ్స్‌ను వీడి ముంబై ఇండియన్స్ జట్టులోకి మారాడు. ఈ భారీ ట్రేడ్‌కు సంబంధించి పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీలు ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయనప్పటికీ, ఈ విషయాన్ని అర్ష్‌దీప్ తండ్రి దర్శన్ సింగ్ స్వయంగా ధ్రువీకరించారు. ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో తన కుమారుడితో పాటు ఉన్న ఆయన, ఈ ట్రేడ్‌కు సంబంధించిన అధికారిక సమాచారం తమకు అందిందని ఒక వీడియో ఇంటర్వ్యూలో వెల్లడించారు. దీంతో ఈ ట్రేడ్ దాదాపు ఖరారైనట్లేనని స్పష్టమైంది.

మాకు కూడా ఆశ్చర్యంగానే ఉంది: దర్శన్ సింగ్

ప్రముఖ క్రీడా జర్నలిస్ట్ విమల్ కుమార్‌తో న్యూజిలాండ్‌లో మాట్లాడిన దర్శన్ సింగ్, ఈ ట్రేడ్ గురించి తమకు ముందుగా ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. “ఈ ట్రేడ్ జరిగిందని మాకు కూడా ఆశ్చర్యంగానే తెలిసింది. దీని గురించి మాతో ముందస్తు చర్చలు ఏమీ జరపలేదు. ఇప్పుడు ట్రేడ్ అయినట్లు అధికారిక సమాచారం అందిందని అనుకుంటున్నాను” అని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ ఒప్పందంలో భాగంగా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు వెళ్తున్నాడా? లేదా? అనే విషయంపై ఆయన ఎలాంటి వ్యాఖ్య చేయలేదు.

పంజాబ్‌ను వీడటం భావోద్వేగంగా ఉంది

పంజాబ్ కింగ్స్‌తో అర్ష్‌దీప్‌కు ఉన్న అనుబంధాన్ని దర్శన్ సింగ్ గుర్తుచేసుకున్నారు. “ఒక వ్యక్తి ఎక్కడ పుట్టినా, ఆ ప్రదేశంతో జీవితాంతం ఒక ప్రత్యేకమైన అనుబంధం ఉంటుంది. అర్ష్‌దీప్‌కు పంజాబ్ కింగ్స్ అలాంటిదే. ఆ జట్టుతో అతనికి బలమైన బంధం ఉంది. అందుకే ఆ జట్టును వీడాల్సి రావడం కొంచెం భావోద్వేగంగా అనిపిస్తోంది” అని ఆయన అన్నారు. అయితే, ప్రతీ ఫ్రాంచైజీ తమ జట్టు సమతూకం కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటుందని, వారు కూడా అందుకు అనుగుణంగానే అర్ష్‌దీప్‌ను ట్రేడ్ చేసి ఉంటారని అభిప్రాయపడ్డారు.

ముంబై జట్టులోకి వెళ్లడం సంతోషమే

పంజాబ్‌ను వీడటం బాధగా ఉన్నప్పటికీ, ముంబై ఇండియన్స్ జట్టులోకి వెళ్లడంపై దర్శన్ సింగ్ సంతోషం వ్యక్తం చేశారు. “ముంబై ఇండియన్స్‌లో చేరడం మాకు చాలా ఆనందంగా ఉంది. అక్కడ అతని పాత కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ వంటి పాత సహచరులు ఉన్నారు. కాబట్టి మేం సంతోషంగా ఉన్నాం” అని వివరించారు.

ఐపీఎల్ 2027లో బుమ్రా, అర్ష్‌దీప్ కలిసి బౌలింగ్ చేయడాన్ని చూడటానికి తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. “ఇక ముంబై బౌలింగ్ అటాక్ అద్భుతంగా ఉంటుంది. ఏ స్కోరునైనా వారు అడ్డుకోగలరు. ప్రత్యర్థి జట్లను 200 పరుగుల లోపే కట్టడి చేస్తారని అభిమానులు అంటున్నారు. ఇది గొప్ప భాగస్వామ్యం అవుతుంది” అని ఆయన అన్నారు.

అయితే, ఐపీఎల్‌లో పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా (ఫ్లాట్‌గా) ఉంటాయని, అక్కడ ఏమైనా జరగొచ్చని వాస్తవిక దృక్పథంతో వ్యాఖ్యానించారు. ఈ ట్రేడ్ జీతం, ఇతర వివరాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.


ఇండియా వర్సెస్ న్యూజిలాండ్: ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయిన మూడో వన్డే




భారత్-న్యూజిలాండ్ మధ్య మూడో వన్డేకు వర్షం అంతరాయం కలిగించింది. హామిల్టన్‌లోని సెడ్డన్ పార్క్‌లో మంగళవారం జరగాల్సిన ఈ మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యం కొనసాగుతోంది.


ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో టాస్ ఆలస్యమైంది. పలుసార్లు టాస్‌ను వాయిదా వేశారు. మధ్యలో కాసేపు వరుణుడు విరామం ఇవ్వడంతో టాస్ వరకు మార్గం సుగమమైంది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. వరుసగా మూడోసారి టాస్ గెలిచిన గిల్.. గత రెండు మ్యాచ్‌ల్లో ఆడిన జట్టుతోనే బరిలోకి దిగాలని నిర్ణయించాడు.మ్యాచ్‌ను 40 ఓవర్లకు కుదించి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే మ్యాచ్ ప్రారంభానికి సిద్ధమవుతున్న సమయంలో మళ్లీ వర్షం మొదలైంది. కాసేపటికే అది మరింత పెరగడంతో మైదానాన్ని తిరిగి కవర్లతో కప్పేశారు. ఆటగాళ్లు కూడా డ్రెస్సింగ్ రూములకు చేరుకున్నారు.న్యూజిలాండ్ కాలమానం ప్రకారం రాత్రి 7.50 గంటలకు 20 ఓవర్ల మ్యాచ్ నిర్వహించేందుకు తుది గడువు ఉంది. అప్పటికి ఇంకా 70 నిమిషాల సమయం ఉన్నప్పటికీ వర్షం తగ్గే సూచనలు కనిపించకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.మూడో వన్డే రద్దుతో భారత్‌కు సిరీస్‌లో 2-0 ఆధిక్యం కొనసాగుతోంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల కోసం ఇరు జట్లు టౌరంగాకు వెళ్లనున్నాయి. నాలుగో వన్డే నవంబర్ 13న బే ఓవల్‌లో, ఐదో వన్డే నవంబర్ 15న జరగనున్నాయి.

‘రంగస్థలం’ చిట్టి బాబును..’పుష్ప’ పుష్పరాజ్‌ను మించేలా..!



వజ్రాల ఆభరణాలలో అబ్బురపరిచిన రకుల్ ప్రీత్ సింగ్





సుకుమార్ తెరకెక్కించిన రంగస్థలం, పుష్ప చిత్రాల్లో హీరోల పాత్రల రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. ఇప్పుడు =జ17లో రామ్ చరణ్‌ను ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి పెరుగుతోంది. ప్రీ లుక్‌లోని నెమలి పింఛం ఆధారంగా చరణ్ పాత్రపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. చిట్టిబాబు, పుష్పరాజ్‌లను మించే క్యారెక్టరైజేషన్ ఉంటుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

పాన్ ఇండియా రేసింగ్ లో దర్శకుడు సుకుమార్ స్థానం ఇప్పుడు ఎక్కడ ఉందో తెలిసిందే. పుష్ప, పుష్ప 2 చిత్రాలతో రూ.2000 కోట్ల వసూళ్ల క్లబ్ ని అందుకున్నాడు సుక్కూ. భారతదేశంలో దిగ్గజ దర్శకులుగా చెప్పుకునే చాలా మంది స్టార్ డైరెక్టర్లు ఈ ఫీట్ ని ఇంకా సాధించలేదు. రాజమౌళి, నితీష్ తివారీ లాంటి వారికి ఇలాంటి అరుదైన అవకాశం లభించింది.అందుకే ఇప్పుడు సుకుమార్ తెరకెక్కించే సినిమాపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. ముఖ్యంగా ఉత్తరాది ట్రేడ్ లోను సుక్కూ తన తదుపరి చిత్రంలో కథానాయకుడిని ఎలా చూపించబోతున్నాడు? అన్నది ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. అతడు పాత్రలను సరికొత్తగా తీర్చిదిద్దే విధానం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. రంగస్థలంలో చెవులు వినిపించని(చెవిటి) చిట్టి బాబును.. పుష్పలో గూని వంచే ఊరమాస్ పుష్పరాజ్ ని చూపించిన సుకుమార్ ఆ రెండు పాత్రల ఆహార్యాన్ని అంతకుముందు ఎన్నడూ చూడని విధంగా చూపించారు. సుక్కూ ఎంపిక చేసుకున్న పాత్రలు ఎంతో రియలిస్టిక్ గా, నేచురల్ గా, ప్రజలు రెగ్యులర్ గా చూసేవిగా కనిపిస్తూనే, గమ్మత్తయిన ఆహార్యంతో అలరించాయి.రంగస్థలంలో గోదారి కుర్రాడిగా చరణ్‌ను చూపించిన తీరును ఇప్పటికీ మర్చిపోలేరు. ఇక గంధపు చెక్కల స్మగ్లర్ గా అల్లు అర్జున్ లాంటి స్టైలిష్ స్టార్ ని అతడు పెద్ద తెరపై ఆవిష్కరించిన తీరు గురించి చాలా చర్చ సాగుతూనే ఉంది. టాలీవుడ్ కి ఉత్తమ నటుడిగా మొదటి జాతీయ అవార్డ్ తేగలిగిన ప్రతిభ సుకుమార్ సొంతం.అందుకే ఇప్పుడు రామ్ చరణ్ ని ఆర్.సి 17లో ఎలా చూపింబోతున్నాడు? అన్నది ఆసక్తిగా మారింది. రంగస్థలం లో చిట్టిబాబు పాత్రతో చరణ్ ని అంతకుముందు ఉన్న ఇమేజ్ చట్రం నుంచి బయటకు తెచ్చాడు. కేవలం మాస్ యాక్షన్ హీరోగానే కాదు.. నటుడిగాను అతడిలోని బెస్ట్ ఏంటో చూపించాడు. చిట్టిబాబుగా చరణ్ నటనకు జాతీయ అవార్డ్ రావాల్సింది. రకరకాల కారణాలతో పురస్కారం దక్కలేదనే చర్చ తెలుగు మీడియాలో ఇప్పటికీ సాగుతూనే ఉంది. అందుకే ఇప్పుడు ఆర్.సి 17లో చరణ్ ని సుక్కూ ఎలా చూపించబోతున్నారు? అన్న చర్చ అంతకంతకు వేడెక్కిస్తోంది.

ఇప్పటివరకు =జ17లో చరణ్ పాత్రకు సంబంధించి చిన్న లీక్ కూడా బయటకు రాకుండా సుకుమార్ పూర్తి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే గతంలో విడుదల చేసిన ప్రీ-లుక్ పోస్టర్‌లో కనిపించిన నెమలి పింఛం ఆధారంగా చరణ్ ఈ సినిమాలో గోపీ కృష్ణుడు లేదా ఒక భిన్నమైన రెబెల్ షేడ్ ఉన్న క్యారెక్టర్‌లో కనిపిస్తాడనే ప్రచారం గట్టిగా జరుగుతోంది. చిట్టిబాబును, పుష్పరాజ్ ను దాటుకుని వెళ్లే స్థాయి క్యారెక్టరైజేషన్ డిజైన్ చేయడం సుకుమార్‌కు పెద్ద సవాలే అయినా.. అతడి మార్క్ మేకింగ్ తప్పకుండా మరో బిగ్గెస్ట్ విజువల్ ట్రీట్‌ని ఇస్తుందని ఫ్యాన్స్ ధీమాగా ఉన్నారు. ముఖ్యంగా రామ్ చరణ్ తన కెరీర్ లో మర్చిపోలేని మరో అద్భుతమైన పాత్రలో నటిస్తున్నాడని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఆర్.సి 17 నుంచి చరణ్ లుక్ విడుదలైతే కానీ ఈ పాత్ర ఎలాంటిదో ఇంకా ఊహించలేము.

దీపావళి వేడుకల్లో మెరిసిపోయిన సోఫీ చౌద్రి -- ఆకర్షణీయమైన సీక్విన్డ్ చీరలో మెరిసిన తార

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965